

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 08 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం 09, డిసెంబర్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్






# తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్

## సీఎం రేవంత్ రెడ్డి

## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

## ప్రతి తెలంగాణవాసి భాగస్వామి కావాలి

**హైదరాబాద్, డిసెంబర్ 8 (జై భీమ్ న్యూస్) :**

'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రసంగం చేశారు. "తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్" అంటూ రాష్ట్ర ఎదుగుదలలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కొత్త రాష్ట్రమైనప్పటికీ అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనేదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారడమే ముఖ్య ఆశయమని తెలిపారు. ప్రస్తుతం దేశ జనాభాలో 2.9 శాతం మాత్రమే ఉన్న తెలంగాణ జీడీపీలో 5 శాతం వాటా కలిగి ఉందని, 2047 నాటికి దాన్ని 10 శాతానికి పెంచాలనేది లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రం 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా పెట్టుకుంటే%ా% తెలంగాణ 10 శాతం వాటా (3 ట్రిలియన్) సాధించాలని సంకల్పం తెలిపారు.

మూడు జోన్ల అభివృద్ధి మోడల్ – దేశంలోనే తొలి దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు:

క్యూర్ (CURE) : కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (సేవలు, టెక్ హబ్)

ప్యూర్ (PURE) : పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (తయారీ రంగం)

రేర్ (RARE) : రూరల్ అగ్రికల్చర్ & ఎమర్జింగ్ రీజియన్ ఎకానమీ (వ్యవసాయం, కొత్త రంగాలు)

- మిగతా 2లో..




## అట్టహాసంగా ప్రారంభమైన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్

వికసిత్ భారత్ దిశగా తెలంగాణ రైజింగ్

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

2




## ఇండిగోపై విచారణ జరుగుతోంది

రామ్మోహన్ నాయుడు

విమర్శలు, ఆరోపణలకు రాజ్యసభలో సమాధానం

సంక్షోభానికి ముందు జరిగిన సంఘటనల క్రమాన్ని వివరించిన కేంద్ర మంత్రి

2



## హైదరాబాదులో ఘోరం...

ఇంటర్ విద్యార్థినిని గొంతు కోసి చంపిన యువకుడు

హైదరాబాద్ వారాసిగూడలో ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య

తల్లి కళ్లెదుటే పవిత్ర గొంతు కోసిన మేనమామ వరసయ్యే యువకుడు

ఘటనాస్థలిలో కత్తి, మొబైల్ వదిలి పరారైన నిందితుడు

కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు

2





## విషాదం నీడలో వెలుగులు...

రెండేళ్ల తర్వాత బెత్లెహేంలో వెలిగిన క్రిస్మస్ ట్రీ

ఆనందం, ఆవేదనల మధ్య బెత్లెహేంలో వెలిగిన క్రిస్మస్ ట్రీ

గాజాలో జరుగుతున్న విధ్వంసం కారణంగా నిరాడంబరంగా వేడుకలు

ఇజ్రాయెల్ ఆంక్షలతో కుదేలైన పర్యాటక రంగం, స్థానిక ఆర్థిక వ్యవస్థ

2

## 2026 ఏడాదికి సెలవులు ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం

27 సాధారణ సెలవులు, 26 ఐచ్ఛిక సెలవులు తెలంగాణ

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి

భోగి మొదలు క్రిస్మస్ మరుసటి రోజు వరకు 27 సాధారణ సెలవులు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

2026 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాధారణ మరియు ఐచ్ఛిక సెలవుల జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో మొత్తంగా 27 సాధారణ సెలవులు, 26 ఐచ్ఛిక సెలవులు ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన సాధారణ సెలవుల్లో భోగి, సంక్రాంతి, గణతంత్ర్య దినోత్సవం, మహాశివరాత్రి, హోలి, ఉగాది, రంజాన్, శ్రీరామనవమి, గుడ్ ఫ్రైడే, బాబు జగ్జీవన్ రామ్ జయంతి, డాక్టర్ అంబేద్కర్ జయంతి, బక్రీద్, మొహర్రం, బోనాలు, స్వాతంత్ర్య దినోత్సవం, ఈద్ మిలాద్ ఉన్ నబీ, శ్రీ కృష్ణాష్టమి, వినాయక చవితి, మహాత్మా గాంధీ జయంతి, సద్దుల బతుకమ్మ, విజయ దశమి, దీపావళి, కార్తీక పౌర్ణమి, క్రిస్మస్ ఉన్నాయి. రంజాన్, విజయదశమి, క్రిస్మస్ పండుగల మరుసటి రోజు కూడా సాధారణ సెలవుగా ప్రకటించింది.

# ములుగు జిల్లాలో వరి కొనుగోలు సజావుగా సాగేందుకు పటిష్ట చర్యలు : జిల్లా యంత్రాంగం

**ములుగు, 8 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**


ములుగు జిల్లాలో ఖరీఫ్ 2025-26 పంట సీజన్‌లో రైతుల వద్ద నుండి వరి ధాన్యాన్ని మద్దతు ధర కింద కొనుగోలు చేసే ప్రక్రియను సాఫీగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు గత వానాకాలం 2024-25తో పోల్చి వివిధ విభాగాల్లో తీసుకున్న చర్యల వివరాలను జిల్లా కలెక్టర్ వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సీజన్‌లో కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యం పరిమాణం పెరిగిందని, రవాణా, చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు.

**2024-25, 2025-26 సీజన్‌లలో ధాన్యం కొనుగోలు వివరాలు..**

2024%-%25లో 201 కొనుగోలు కేంద్రాలు పనిచేయగా, ఈ సంవత్సరం 185 కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత ఏడాదిలో 40,676 మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు చేరగా, ఈ సంవత్సరం అది 54,172.440 మెట్రిక్ టన్నులకు పెరిగింది. 17 శాతం తేమతో చేరిన ధాన్యం కూడా 32,028 ఎంటి నుంచి 39,221 ఎంటి కు పెరిగింది. మిల్లులకు రవాణా చేసిన ధాన్యం 31,903 ఎంటి నుంచి ఈ సంవత్సరం 39,185 ఎంటికి పెరిగింది. మద్దతు ధర కింద గత సంవత్సరం ?42.69 కోట్లు రైతులకు చెల్లించగా, ఈసారి ?62.44 కోట్లు చెల్లించినట్లు తెలియజేశారు. బోనస్ చెల్లింపులు మాత్రం ?5.64 కోట్ల నుండి ?1.09 కోట్లకు తగ్గాయి. కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసిన తార్పాలిన్ కవర్లు 1,422 నుండి 2,087 కు, ఖాళీ బస్తాలు 16.65 లక్షల నుండి 23.99 లక్షలకు పెరిగినట్లు జిల్లా అధికారులు వివరించారు.

**రైతుల కోసం ఫిర్యాదు కేంద్రం ఏర్పాటు..**

ధాన్యం కొనుగోలులో రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే ఫిర్యాదు చేసేందుకు జిల్లా స్థాయి ఫిర్యాదు కేంద్రం ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదు చేయడానికి టోల్‌ఫ్రీ నంబర్లు 9347416178, 180042500333, 1967. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ములుగు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.


సం.Paddy/MLG/Khariff -2025-26 తేది :08.12.2025.

పత్రికా ప్రకటన

| వానాకాలం 2024-25 (ఖరీఫ్) | | వానాకాలం 2025-26 (ఖరీఫ్) | |
|---|---|---|---|
| వరి ధాన్యం కొనుగోలు చేయుటకు మొత్తం తెరిచిన కొనుగోలు కేంద్రాలు | 201 | వరి ధాన్యం కొనుగోలు చేయుటకు మొత్తం తెరిచిన కొనుగోలు కేంద్రాలు | [illegible] |
| కొనుగోలు కేంద్రములో వచ్చిన మొత్తం ధాన్యం (మెట్రిక్ టన్నులలో) | 40676.000 | కొనుగోలు కేంద్రములో వచ్చిన మొత్తం ధాన్యం (మెట్రిక్ టన్నులలో) | 54172.440 |
| 17 శాతం తేమతో కొనుగోలు కేంద్రములో వచ్చిన మొత్తం ధాన్యం (మెట్రిక్ టన్నులలో) | 32028.002 | 17 శాతం తేమతో కొనుగోలు కేంద్రములో వచ్చిన మొత్తం ధాన్యం (మెట్రిక్ టన్నులలో) | 39221.560 |
| కొనుగోలు చేసిన మొత్తం ధాన్యంలో మిల్లులకు రవాణా చేసిన పరిమాణం (మెట్రిక్ టన్నులలో) | 31903.562 | కొనుగోలు చేసిన మొత్తం ధాన్యంలో మిల్లులకు రవాణా చేసిన పరిమాణం (మెట్రిక్ టన్నులలో) | 39185.880 |
| కొనుగోలు చేసిన మొత్తం ధాన్యంలో మిల్లులకు రవాణా చేయని పరిమాణం (మెట్రిక్ టన్నులలో) | 124.440 | కొనుగోలు చేసిన మొత్తం ధాన్యంలో మిల్లులకు రవాణా చేయని పరిమాణం (మెట్రిక్ టన్నులలో) | 35.680 |
| కొనుగోలు చేసిన మొత్తం ధాన్యం నకు మద్దతు ధర చెల్లించిన రూపాయలు (కోట్లలో) | 42.69 | కొనుగోలు చేసిన మొత్తం ధాన్యం నకు మద్దతు ధర చెల్లించిన రూపాయలు (కోట్లలో) | 62.44 |
| కొనుగోలు చేసిన మొత్తం ధాన్యం నకు బోనసు చెల్లించిన రూపాయలు (కోట్లలో) | 5.64 | కొనుగోలు చేసిన మొత్తం ధాన్యం నకు బోనసు చెల్లించిన రూపాయలు (కోట్లలో) | 1.09 |
| కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసిన టార్పాలిన్ కవర్లు | 1422 | కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసిన టార్పాలిన్ కవర్లు | 2087 |
| కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసిన ఖాళీ బస్తాలు | 1665970 | కొనుగోలు కేంద్రాలకు సరఫరా చేసిన ఖాళీ బస్తాలు | 2399998 |
| అందుబాటులో ఉన్న టార్పాలిన్ కవర్లు | 2278 | అందుబాటులో ఉన్న టార్పాలిన్ కవర్లు | 1613 |
| అందుబాటులో ఉన్న ఖాళీ బస్తాలు | 1073836 | అందుబాటులో ఉన్న ఖాళీ బస్తాలు | 1256189 |

...ఫిర్యాదుల కేంద్రం టోల్ ఫ్రీ నం. 9347416178 అదేవిధంగా పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యాలయం,హైదరాబాద్ టోల్ ఫ్రీ నం. 180042500333/1967 నకు ఫిర్యాదు చేయగలరు.

జిల్లా కలెక్టర్, ములుగు జిల్లా

## ఎంజీఎం హాస్పిటల్‌లో క్షయ-ఎయిడ్స్ నియంత్రణపై సమన్వయ సమావేశం






**వరంగల్, 8 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

ఎంజీఎం హాస్పిటల్ అకాడమిక్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు అధ్యక్షతలో డిఎపిసిఓ యూనిట్, టిబి యూనిట్ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. టీబీ అలర్ట్ ఇండియా, డిఎపిసిఓ సేవలు పరస్పర సంబంధం కలిగినవని ఆయన సమావేశంలో పేర్కొన్నారు. ఒక వ్యాధితో బాధపడే వారికి మరో వ్యాధి సోకే ప్రమాదం అధికంగా ఉండడంతో, జిల్లా%-%డివిజన్%-%మండల స్థాయిల్లో క్షయ, ఎయిడ్స్ గుర్తింపు మరియు అవగాహన కార్యక్రమాలను విస్తరించాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో వరంగల్ జిల్లాను క్షయ%-%ఎయిడ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. సీనియర్ వైద్యాధికారి డాక్టర్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూఎయిడ్స్, క్షయ వ్యాధులకు ముందస్తు పరీక్షలు, డాక్టర్ల సూచనల ప్రకారం చికిత్స తీసుకుంటే వ్యాధిని అధిక శాతం నియంత్రించవచ్చని తెలిపారు. క్షయ వ్యాధి లక్షణాలుగా రెండు వారాలకుపైగా దగ్గు, నిరంతర జ్వరం, బరువు తగ్గిపోవడం, రాత్రి చెమటలు, అలసట, ఆకలి కోల్పోవడం వంటి విషయాలను గుర్తు చేశారు. ఎయిడ్స్ వ్యాధి రక్షణలేని లైంగిక సంబంధాలు, అపరిశుభ్రమైన సూదుల వినియోగం, రక్తమార్పిడి ద్వారా వ్యాప్తి చెందుతుందని వివరించారు. డిఎపిసిఓ ప్రోగ్రాం అధికారి డాక్టర్ హిమబిందు రెండు యూనిట్లు సమన్వయంతో పనిచేయాలని సూచించగా, డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ బ్లేస్సి టిబి ప్రివలెన్స్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు లక్షణాలు గమనించిన వెంటనే పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లల్లో లక్షణాలను గుర్తించడంలో ఆలస్యం జరగడం వలన మరణాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ మోహన్ సింగ్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, క్షయ యూనిట్, డిఎపిసిఓ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

## లా కళాశాల విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం వెంటనే కల్పించాలి

కేయూ లా స్టూడెంట్స్ నిరసన







**హన్మకొండ, 8 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ న్యాయ కళాశాల ఐదు సంవత్సరాల లా కోర్సు విద్యార్థులు సోమవారం హాస్టల్ సౌకర్యాల కోసం భారీ నిరసన తెలిపారు. యూనివర్సిటీ మొదటి గేటు నుండి పరిపాలన భవనం వరకు ర్యాలీగా వచ్చిన విద్యార్థులు, అనంతరం పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహిస్తూ తమ సమస్యలపై అధికారుల స్పందన కోరారు. న్యాయ విద్యార్థులు మాట్లాడుతూ “యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేస్తున్న మాకు ఇప్పటికీ ఒక హాస్టల్ గది కూడా కేటాయించలేదు. ఇది లా కళాశాల పట్ల యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం,” అని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ పట్టించుకునేవారు లేరని వారు ఆరోపించారు. విద్యార్థులు హెచ్చరిస్తూ “హాస్టల్ సౌకర్యం వెంటనే కల్పించకపోతే, మేమంతా వీ.సీ. పరిపాలన భవనం వద్దే బస ఏర్పాట్లు చేసుకొని నిరసన కొనసాగిస్తాం,” అని స్పష్టం చేశారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్, హాస్టల్ డైరెక్టర్ వచ్చి విద్యార్థులతో మాట్లాడినప్పటికీ, వారి హామీలను విద్యార్థులు సంతృప్తికరంగా భావించలేదు. హాస్టల్ సౌకర్యం కల్పించేంతవరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని విద్యార్థులు ప్రకటించారు. నిరసన కార్యక్రమంలో స్టాలిన్, రంజిత్ కుమార్, సందీప్, అరుణ్, రాకేష్ రెడ్డి, శ్రీను, ఆదిత్య, సంధ్య, రోహిత్, ప్రదీప్, శివాజీ, యాకూబ్, ప్రవళిక, సింధు, దిశా, రణధీర్, శరత్, వర్షిత్, శృతి తదితరులు పాల్గొన్నారు. అలాగే సాయి కీర్తన, అశ్విత, చందన, నిచిత, అశ్వినీ, శర్వాణి, లాసిని, సంజన, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత సమాజమే మన అందరి లక్ష్యం

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**హన్మకొండ, 8 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

అవినీతి రహిత సమాజాన్ని నిర్మించడం మన అందరి బాధ్యతగా భావించాలని, ప్రతి పౌరుడు దీనిలో భాగస్వామ్యం కావాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. అవినీతి వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. హనుమకొండ జూనియర్ కళాశాల నుండి అశోక సెంటర్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులతో పాటు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, ఏసీబీ అధికారులు, సిబ్బంది భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీ సన్ ప్రీత్ సింగ్ “అవినీతిని నిర్మూలించగలిగితేనే దేశాభివృద్ధి వేగవంతమవుతుంది. ముఖ్యంగా విద్యార్థులు, యువత అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చురుకుగా పాల్గొంటే సమాజంలో సానుకూల మార్పులు జరుగుతాయి” అని పేర్కొన్నారు. అలాగే ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం కోరిన పక్షంలో వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064 కు సమాచారం అందించాలని పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్ రాజు, ఇతర ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

## సుబేదారి పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన డీసీపీ ధారా కవిత




**వరంగల్, 8 డిసెంబర్ 2025 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**



వరంగల్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డీసీపీ ధారా కవిత సోమవారం సుబేదారి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ ప్రాంగణం, పరిసరాల శుభ్రత, రికార్డుల నిర్వహణను ఆమె సమీక్షించారు. స్టేషన్ సిబ్బంది విధి నిర్వహణ, ఫిర్యాదులపై స్పందించే తీరు, ప్రజలతో వ్యవహార శైలి వంటి అంశాలను డీసీపీ ప్రత్యేకంగా పరిశీలించారు. మహిళలు, పిల్లలు నమోదు చేసే ఫిర్యాదులపై చేపడుతున్న చర్యలు, కేసుల పురోగతిపై కూడా ఆమె వివరాలు తెలుసుకుంది. నేరాల నియంత్రణలో ప్రజా అవగాహన ప్రధానమని డీసీపీ పేర్కొంటూ, పోలీసు సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. డీసీపీ ధారాకవిత మాట్లాడుతూ గ్రామ స్థాయి వరకు నేర నిరోధక అవగాహన కార్యక్రమాలను విస్తరించాలని, మారక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యాసంస్థలు, కాలేజీలు, పబ్లిక్ ప్రదేశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె ఆదేశించారు. ప్రజా భద్రత, నేరాల నివారణలో పోలీసులు మరింత చురుకుగా వ్యవహరించాలని ధారాకవిత స్పష్టం చేశారు.

## ప్రొ. రాజేంద్రనాథ్ మృతి పట్ల కేయూ జంతుశాస్త్ర విభాగం నివాళి



**వరంగల్, 7 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డా. రాజేంద్రనాథ్ శనివారం ఉదయం హైదరాబాద్‌లోని తన స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందడం పట్ల కేయూ జంతుశాస్త్ర విభాగం అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జంతుశాస్త్ర విభాగంలో విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకయ్య ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. డా. రాజేంద్రనాథ్ 30 ఏళ్లకు పైగా కాకతీయ యూనివర్సిటీ సేవలో పనిచేసి, 2005లో పదవీ విరమణ చేసిన విషయం ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకయ్య మాట్లాడుతూ డా. రాజేంద్రనాథ్ విశ్వసనీయ ఉపాధ్యాయుడు, మంచి నిర్వాహకుడు. పరీక్షల విభాగం కంట్రోలర్‌గా, యూనివర్సిటీ లైబ్రరీ ఇన్‌ఛార్జిగా, జంతుశాస్త్ర విభాగాధిపతిగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించి విశిష్ట సేవలు అందించారు,” అని పేర్కొన్నారు. శ్రద్ధాంజలి కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగ అధ్యాపకులు ప్రొఫెసర్ సమిత, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, ప్రొఫెసర్ ఈసం నారాయణ, వృక్షశాస్త్ర విభాగానికి చెందిన డా. ఆశీర్వాదం, విద్యార్థినీ-విద్యార్థులు పాల్గొన్నారు.

## అవినీతి వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం

కలెక్టర్ స్నేహ శబరిష్ పోస్టర్ల ఆవిష్కరణ

**హన్మకొండ, డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**




రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 3 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న అవినీతి వ్యతిరేక వారోత్సవాల సందర్భంలో, వరంగల్ రేంజ్ అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రజల్లో పారదర్శకత, నైతికత, అవినీతి నిర్మూలనపై అవగాహన పెంపొందించేందుకు ర్యాలీలు, ప్రజా సమావేశాలు, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టింది. ఈ కార్యక్రమాల భాగంగా సోమవారం హనుమకొండలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాకలెక్టర్ స్నేహ శబరిష్, ఐఏఎస్ ఈ సందర్భంగా అవినీతి వ్యతిరేక వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, “అవినీతి నిర్మూలనలో ప్రతి పౌరుడు, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సమాన బాధ్యత వహించాలి. నైతిక విలువలు, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం,”అని పేర్కొన్నారు. ప్రజల అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన పోస్టర్లు, నైతికత ప్రాముఖ్యతను మరియు అవినీతి ఫిర్యాదుల కోసం అందుబాటులో ఉన్న అధికారిక మార్గాలను స్పష్టం చేస్తాయని తెలిపారు. అవినీతి నిరోధక విభాగం ప్రజలను వారోత్సవాల్లో చురుకుగా పాల్గొనాలని కోరుతూ, “ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి పని చేయడానికి లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు లేదా ఇతర అధికారిక వేదికల ద్వారా నిర్భయంగా ఫిర్యాదు చేయాలి,” అని విజ్ఞప్తి చేసింది. పారదర్శక ప్రజాపరిపాలన, అవినీతి నిర్మూలన కోసం ఏసీబీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో వరంగల్ ఏసీబీ డీఎస్పీ పి. సాంబయ్య, ఇన్స్పెక్టర్ ఎస్. రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# దక్షిణ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌కు కేయూ మహిళా జట్టు ఎంపిక

**డిసెంబర్ 9-11 తేదీల్లో విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో పోటీలు**

**వరంగల్, 08 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో డిసెంబర్ 9 నుండి 11 వరకు జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ (మహిళల) టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు కాకతీయ విశ్వవిద్యాలయ మహిళా జట్టును ఎంపిక చేసినట్టు విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య వై. వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఆటగాళ్లలో ఎం. శ్వేతా ౹ విశ్వవిద్యాలయ వ్యాయామ కళాశాల, పి. వర్షిత ౹ కొత్తగూడెం యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ, ఎం. వర్షిత, పి. శ్రావణి ౹ వరంగల్ కిట్స్ కాలేజీ, ఎం. నందిని వరంగల్ ఈస్ట్ టి.జి.ఎస్.డబ్ల్యూ.ఆర్.డి.సి(డబ్ల్యూ) ఉన్నారు. జట్టుకు కోచ్-కమ్-మ్యానేజర్‌గా జనగాం ఏబీవీ డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ టి. కళ్యాణి బాధ్యతలు నిర్వహించనున్నారని ఆచార్య వెంకయ్య వెల్లడించారు. పోటీలకు ఎంపికైన విద్యార్థినులు విశ్వవిద్యాలయ తరఫున ప్రతినిధ్యం వహించేందుకు సిద్ధమయ్యారని, రాబోయే మ్యాచ్‌లలో వారు ఉత్తమ ప్రతిభ కనబరిచే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



## నిబంధనలు అతిక్రమించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవు

**ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు**





**వరంగల్, 8 డిసెంబర్ 2025 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్‌రావు హెచ్చరించారు. ట్రై-సిటీ పరిధిలో నిన్న నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడిన వాహనదారులకు వరంగల్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులను ఉద్దేశించి అదనపు డీసీపీ మాట్లాడారు. మీ కుటుంబాల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో పెట్టుకొని మద్యం సేవించి వాహనం నడపకండి. అలాంటి నిర్లక్ష్యంతో జరిగే రోడ్డు ప్రమాదాల వల్ల ఎన్నో కుటుంబాలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నాయి అని ఆయన హెచ్చరించారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమని, వారి చేతుల్లో వాహనం ఇస్తే వాహన యజమాని పై కేసు నమోదు చేయబడుతుందని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడటం అత్యంత ప్రమాదకరం అని, దానిని పూర్తిగా నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాకతీయ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 9-10 తేదీల్లో నోబెల్ ప్రైజ్ డే వేడుకలు

**విభాగాల వారీగా పోస్టర్ ప్రెజెంటేషన్లు, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్న స్టూడెంట్ అఫైర్స్ విభాగం**

**హన్మకొండ, 8 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం స్టూడెంట్ అఫైర్స్ డీన్ కార్యాలయం ఆధ్వర్యంలో డిసెంబర్ 9 మరియు 10 తేదీలలో రెండు రోజులపాటు నోబెల్ ప్రైజ్ డే సెలబ్రేషన్స్‌ను నిర్వహిస్తున్నట్టు స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఆచార్య మామిడాల ఇస్తారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా మొదటి రోజు డిసెంబర్ 9న ఉదయం 10:00 గంటల నుంచి 11:30 గంటల వరకు విశ్వవిద్యాలయంలోని పలు విభాగాల్లో నోబెల్ పురస్కారాలకు సంబంధించిన అంశాలపై పోస్టర్ ప్రెజెంటేషన్లు మరియు వక్తృత్వ పోటీలు జరగనున్నాయి. వాటిలోని రసాయన శాస్త్ర విభాగంలో నోబెల్ కెమిస్ట్రీ డిస్కవరీస్ – ట్రాన్స్ఫార్మింగ్ సైన్స్ అండ్ సొసైటీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బోటనీ, జూలజీ, ఫార్మసీ విభాగాలులో: "నోబెల్ డిస్కవరీస్ ఇన్ హ్యూమన్ హెల్త్ , భౌతిక శాస్త్ర విభాగంలో – హౌ నోబెల్ ప్రైజ్ డిస్కవరీ ఇన్ ఫిజిక్స్ షేప్డ్ అవర్ మోడరన్ వరల్డ్, ఆర్థిక శాస్త్ర విభాగంలో – హౌ నోబెల్ ప్రైజ్ డిస్కవరీ ఇన్ ఎకనామిక్స్ ట్రాన్స్ఫార్మ్డ్ సొసైటీస్, ఇంగ్లీష్ విభాగంలో –నోబెల్ లారీట్స్ ఇన్ లిటరేచర్ – వాయిస్స్ థట్ చేంజ్డ్ ది వరల్డ్ " అనే అంశాలు నిర్ణయించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆవిష్కరణలు, సాహిత్య దిశలో నోబెల్ గ్రహీతల కృషి, ప్రపంచాన్ని మార్చిన కీలక ఆలోచనలను పరిచయం చేయడం ఈ వేడుకల ప్రధాన లక్ష్యమని డీన్ ఇస్తారి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం శాస్త్ర, సాహిత్య, సామాజిక అవగాహన పెంపొందించడంలో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

## ట్రైసిటీలో ఆకస్మిక తనిఖీలు ముమ్మరం

**తనిఖీల్లో స్వయంగా పాల్గొన్న వరంగల్ సీపీ**

**వరంగల్, డిసెంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆకస్మిక తనిఖీలను పోలీసులు సోమవారం సాయంత్రం నుంచి విస్తృతంగా చేపట్టారు. కమిషనర్ ఆదేశాల మేరకు ట్రైసిటీ ప్రాంతంలోని ప్రధాన కాలనీలను పోలీసు బృందాలు దిగ్బంధం చేసి తలుపుతట్టి సోదాలు నిర్వహించాయి. ప్రత్యేక బృందాలతో కలిసి వరంగల్ సీపీ స్వయంగా పలు ప్రాంతాల్లో తనిఖీలలో పాల్గొని పరిస్థితిని సమీక్షించారు. కాలనీల్లో సంచరిస్తున్న అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, ఇళ్లను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితుల వ్యక్తిగత వివరాలు, వాహన పత్రాలు, గత చరిత్రలను కూడా పోలీసులు స్థానిక డేటాబేస్‌తో మ్యాచింగ్ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాలనీల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీపీ సూచించారు. నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. పోలిస్ లు తెలిపిన ప్రకారం, ఈ విధమైన ఆకస్మిక తనిఖీలు కమిషనరేట్ పరిధిలో నిరంతరం కొనసాగనున్నాయి.



## గ్రామాల్లో అదుపు తప్పిన వీధి కుక్కల ఉగ్ర సంచారం

**మడిపల్లి బస్ స్టాండ్‌లో చిన్నారులు, వృద్ధులు ప్రాణాల ముప్పులో.. "గ్రామాల నుండి మొదట కుక్కలను పంపండి... లేకపోతే ఓటు మర్చిపోండి" - ప్రజల గట్టి హెచ్చరిక**



**హన్మకొండ, 8 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో గ్రామాల్లో వీధి కుక్కల పెత్తనం రోజు రోజుకీ అదుపు దాటిపోతూ ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది. ఎక్కడ చూసినా గుంపులుగా తిరుగుతున్న కుక్కలు చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఎవరినీ వదలకుండా వెంటాడుతూ గ్రామస్థుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. "గ్రామం అంతా కుక్కలే ప్రజల కన్నా కుక్కలే ఎక్కువయ్యారు!" అంటూ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇతర గ్రామాలు మాత్రమే కాదు, మడిపల్లి బస్ స్టాండ్ పరిస్థితి అయితే మరింత భయంకరంగా మారింది. ప్రయాణికులతో రద్దీగా ఉండాల్సిన ఈ ప్రదేశం ఇప్పుడు కుక్కల గూడు లా మారిపోయింది. స్కూల్ పిల్లలు బస్సు కోసం వేచి ఉన్నా, వృద్ధులు సహాయంగా నడుస్తున్నాకుక్కల గుంపులు అడుగుజాడలా వెంటాడుతూ భయపెడుతూనే ఉన్నాయి. "బస్ స్టాండ్‌కి వెళ్లడం అంటే ప్రాణాలతో పందెం కట్టినట్టే!" అంటూ స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కుక్కల బెడద ఆగే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు ఇళ్ల నుండి బయటికి రావడానికే భయపడుతున్నారు. ఇప్పటికే ఈ సమస్య గ్రామాల్లో ఎన్నికల వాతావరణాన్నే కుదిపేసింది. సర్పంచ్ అభ్యర్థులు ప్రచారం కోసం గ్రామాలను సందర్శించగానే, ప్రజలు వారిని నిలదీస్తూ ఒకే డిమాండ్‌ను గట్టిగా వినిపిస్తున్నారు"మొదట వీధి కుక్కలను గ్రామం నుండి పంపించండి లేకపోతే ఓటు విషయం మర్చిపోండి." భద్రత కోసమే ఇప్పుడు ప్రజల ఓటు హక్కు మార్గం మార్చుకునే స్థాయికి చేరుకుంది. రాజకీయ హామీలన్నింటికంటే ముందుగా జీవ భద్రత ప్రధాన అంశంగా మారిపోయింది. గ్రామస్థులు స్పష్టంగా చెబుతున్నారువీధి కుక్కల నియంత్రణపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి, టీకాలు, శస్త్రచికిత్సలను వేగవంతం చేయాలి, బస్ స్టాండ్, పాఠశాలల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలి, రాత్రివేళ కుక్కల మూకలను అరికట్టేందుకు పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి, చిన్నారులు-వృద్ధుల రక్షణ కోసం అత్యవసర చర్యలు చేపట్టాలి. "మా గ్రామాల్లో భయం జీవనశైలిగా మారిపోయింది ఇప్పటికైనా అధికారులు కదల్లేకపోతే ప్రజలు బయటికి రావడానికే భయపడే రోజులు వస్తాయి" అని గ్రామస్థులు ఆగ్రహంతో, ఆవేదనతో చెబుతున్నారు.

## మేడారం జాతర బందోబస్తుకు వచ్చే సిబ్బందికి సమగ్ర వసతులు కల్పించాలి

**ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఆదేశాలు**

**ములుగు, 8 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**



మేడారం మహా జాతర బందోబస్తు కోసం జిల్లా లోకి భారీ ఎత్తున చేరుకునే పోలీసులు, అధికారులు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ముందస్తుగానే అన్ని వసతులు సిద్ధం చేయాలని ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్, ఐపీఎస్ ఆదేశించారు. వెంగలాపూర్ నుంచి బయ్యక్కపేట వరకు, అలాగే మేడారంలో వసతుల కోసం నిర్దేశించిన ప్రాంతాలను ఎస్పీ స్వయంగా సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. ప్రతి చోట ఉన్న లోటుపాట్లను పరిశీలించి, జాతర సమయంలో సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలంటే వారికి అవసరమైన వసతులు తప్పనిసరిగా కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాతర ప్రారంభానికి ముందే వసతుల ఏర్పాట్లు, అవసరమైన మౌలిక వసతుల పనులు పూర్తిచేయాలని ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తదనంతరం మేడారం ప్రాంతంలో జరుగుతున్న రహదారి పనులు, దేవస్థానంలో జరుగుతున్న ఏర్పాట్లను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఓఎస్డీ శివం ఉపాధ్యాయ్ ఐపీఎస్, ములుగు డీఎస్పీ రవీందర్, పసర సీఐ దయాకర్, ఆర్ఐలు స్వామి, వెంకటనారాయణ, తిరుపతిలు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సేవలను మరింత బలోపేతం చేస్తామని హామీ

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**





**హైద్రాబాద్, 8:డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా చైర్మన్లు, రాష్ట్ర పాలకవర్గ సభ్యుల సమక్షంలో రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ సొసైటీ ప్యాట్రన్, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. సమావేశంలో మాట్లడిన నాయిని రాజేందర్ రెడ్డి, రక్తదానం సహా మానవతా సేవల్లో రెడ్ క్రాస్ సొసైటీ అందిస్తున్న విశేష సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అత్యవసర వైద్య పరిస్థితుల్లో ప్రజలకు అందించే సహాయం అమూల్యమని అభినందించారు. రాష్ట్ర పాలకవర్గంలో చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారుల నియామకాలు త్వరితగతిన జరుగేందుకు ముఖ్యమంత్రితో చర్చించి, రాష్ట్ర గవర్నర్ దృష్టికి కూడా తీసుకువెళ్లేందుకు తక్షణ చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే జిల్లా చైర్మన్లు, పాలకవర్గ సభ్యులను త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసేలా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన చోట్ల రెడ్ క్రాస్ భవనాల నిర్మాణం, భూ కేటాయింపుల విషయంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను త్వరలో సీఎం రేవంత్ రెడ్డికి అందజేస్తానని చెప్పారు. తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు నెలసరి ఆర్థిక సహాయ పథకం అమలుకు కూడా ప్రభుత్వ దృష్టిని ఆకర్షిస్తానని స్పష్టం చేశారు. రెడ్ క్రాస్ సేవలు రాష్ట్రంలో మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే, ఇలాంటి మానవతా కార్యక్రమాలకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు తోడ్పాటునందిస్తుందని తెలిపారు. సమావేశం ముగింపులో నాయిని రాజేందర్ రెడ్డి గారిని నిర్వాహకులు ప్రత్యేకంగా సత్కరించి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, తోట రాజశేఖర్, కె. ప్రసాద్ రావు, జనార్దన్ రావు, మహేందర్ రెడ్డి, అలాగే జిల్లా చైర్మన్లు గోలి అమరేందర్ రెడ్డి, ఎం. రాజేశ్వర్ రావు, మామిడి భీమ్ రెడ్డి, సాయి చౌదరి, భాస్కర్ రెడ్డి, వనజ రెడ్డి, వరప్రసాద్, కేశవ రెడ్డి, గంగేశ్వర్, సుదర్శన్ రెడ్డి, ఆంజనేయులు, రాజన్న, కోటేశ్వరి, రాధాకృష్ణ, విజయ్, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వివాదాస్పందగా ఎన్టీఆర్ సర్కిల్

**వాజ్‌పేయ్ పేరు పెట్టాలని బిజెపి నేతల పట్టు**

**ఇరువర్గాల పోటాపోటీ ధర్నాలు**

**మచిలీపట్నం,డిసెంబర్8(జై భీమ్ న్యూస్)**

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఎన్టీఆర్ సర్కిల్ వివాదాస్పదంగా మారింది. గత రెండు రోజుల క్రితం హౌసింగ్ బోర్డు రింగ్‌కు దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి సర్కిల్ అని బీజేపీ నేతలు నామకరణం చేసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. సోమవారం అదే రింగ్‌లో వాజ్‌పేయి విగ్రహా శంకుస్థాపనకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే వాజ్‌పేయి పేరు పెట్టడాన్ని తెలుగుదేశం నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలోనే హౌసింగ్ బోర్డు రింగ్‌లో కూర్చుని నిరసన తెలిపారు అర్బన్ బ్యాంక్ చైర్మన్ దిలీప్ కుమార్. గతంలోనే హౌసింగ్ బోర్డు రింగ్ సెంటర్‌ను ఎన్టీఆర్ సర్కిల్‌గా నామకరణ చేస్తూ మున్సిపాల్టీలో తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని మున్సిపాల్టీలో తీర్మానం చేసింది అప్పటి పాలకవర్గం. ఎన్టీఆర్ సర్కిల్‌గా ఉన్న ఈ సెంటర్‌ను.. వాజ్‌పేయి సర్కిల్‌గా ఎలా పెడతారని ప్రశ్నిస్తున్నారు టీడీపీ నేతలు. వాజ్‌పేయా సర్కిల్‌గా పెట్టవద్దని తెలుగు తమ్ముళ్ల ఆందోళనకు దిగారు. ఇదే క్రమంలో హౌసింగ్ బోర్డ్ రింగ్‌కు వచ్చి బీజేపీ నేతలు కూడా పోటాపోటీగా నిరసన తెలిపారు. ఇప్పుడు ఈ వివాదం మచిలీపట్నంలో చర్చనీయాంశంగా మారింది.

# ఆఫీసయ్యాక నో కాల్స్, నో ఈ-మెయిల్స్

(హైదరాబాద్ జై భీమ్ న్యూస్)

ఉద్యోగుల పని సమయం దాటిన తర్వాత విధి నిర్వహణకు సంబంధించిన ఈ-మెయిల్స్, ఫోన్ కాల్స్‌కు హాజరు కాకుండా నిరోధించే ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును శుక్రవారం లోక్‌సభలో ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే ప్రవేశపెట్టారు. ఉద్యోగుల సంక్షేమ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ప్రవేశపెట్టిన 'రైట్ టు డిస్‌కనెక్ట్ బిల్లు, 2025' ప్రకారం ప్రతి ఉద్యోగి తన కార్యాలయ పనివేళలు ముగిసిన తర్వాత, సెలవు దినాల్లో విధి నిర్వహణకు సంబంధించిన ఫోన్ కాల్స్, ఈ-మెయిల్స్ లాంటి పనులకు హాజరవ్వనక్కర్లేని హక్కు లభిస్తుంది. పని వేళలు ముగిసిన తర్వాత కూడా తమకు అప్పగించే పనిని, కాల్స్‌ను వారు తిరస్కరించ వచ్చు. కాగా, రుతుస్రావ కాలంలో మహిళలకు తమ పని ప్రదేశాలలో సౌకర్యాలు, సహాయం అందించే విధంగా మరో ప్రైవేట్ బిల్లు రుతు క్రమ ప్రయోజనాల బిల్లు, 2024ను తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ కడియం కావ్య ప్రవేశపెట్టారు. చట్టాలు అవసరమని భావించే అంశాలపై లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ప్రైవేట్ మెంబర్ బిల్లులు ప్రవేశపెట్టవచ్చు.



# సూదన్‌పల్లి అభివృద్ధే నా లక్ష్యం

**ప్రజలు గెలిపిస్తే మార్పు తీసుకొస్తా: సర్పంచ్ అభ్యర్థి కోడెపాక పద్మ బాబు**

**హసన్‌పర్తి, డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలానికి చెందిన సుదన్‌పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న కోడెపాక పద్మ బాబు, ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే గ్రామాన్ని సమగ్ర అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని నమ్మకంగా తెలిపారు. గ్రామం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహనతో, వాటి పరిష్కారం కోసం కృషి చేసే నాయకత్వం ఇప్పుడు అత్యవసరమని ఆమె అన్నారు. ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియలో ఎస్సీ మహిళకు సర్పంచ్ పదవి కేటాయించడంతో తాను ఈ ఎన్నికల్లో బరిలో దిగినట్లు పద్మ బాబు వెల్లడించారు. "గ్రామ ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతోనే ఈ పోటీలోకి వచ్చాను. మౌలిక వసతుల అభివృద్ధి, సమస్యల పరిష్కారం, గ్రామం పురోగతి ు ఇవే నా ప్రధాన ధ్యేయాలు" అని ఆమె స్పష్టం చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, ఎన్నికల్లో గెలిచిన వెంటనే తొలి ప్రాధాన్యంగా దీనిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రహదారులు, కాలువలు, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి అన్ని మౌలిక వసతుల ఏర్పాటు దిశగా కృషి చేస్తానని తెలిపారు. గ్రామ అభివృద్ధికి శాశ్వత పరిష్కారాలు అందించేందుకు అధికారులు, ప్రజలతో సమన్వయం చేస్తూ నిరంతరం అందుబాటులో ఉంటానని ఆమె ఆశ్వాసం ఇచ్చారు. గత పది సంవత్సరాలుగా తన భర్త కోడెపాక బాబు పంచాయతీ వార్డు సభ్యుడిగా ప్రజలతో కలిసి గ్రామాభివృద్ధికి చేసిన కృషి తమకు ప్రేరణగా నిలిచిందని పద్మ బాబు పేర్కొన్నారు. మాకు సేవే ధర్మం. గ్రామం కోసం మా కుటుంబం ఎప్పుడూ ముందుంటుంది. ప్రజల విశ్వాసం నా బలం అని అన్నారు. సూదన్‌పల్లిని ముందంజలో నిలిపే అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తానని హామీ ఇస్తూ, ప్రజలు తనకు ఆశీర్వాదం అందించి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె వేడుకున్నారు.



# ఓ చారి నీవే బీసీ ఉద్యమాల జ్యోతివి నీవే

జై భీమ్ న్యూస్ (హన్మకొండ)

జ్వాలవై పుట్టినావు చారి.. జనంలో జాగృతి రగిలించినావు చారి..
బీసీ హక్కుల కోసం రోడ్డుపై రగిలిన రక్తపు అక్షరం నీవే చారి

ఒక్క అగ్నికణం గడ్డకట్టిన చరిత్రను
కరిగించగలదని ఈ నేల చూస్తే..
అదే నిజం చేసినవాడు నువ్వు.

తెలంగాణ ఆవిర్భావంలో శ్రీకాంత్ చారి
త్యాగ జ్యోతి ఎలా మెరిసిందో ఇప్పుడు బీసీల సమానహక్కుల
యుద్ధంలో సాయి ఈశ్వరాచారి అదే అగ్నికి నూతన దిక్సూచి!

నీ జ్వాలు అణగారిన వారి అరుపుల ప్రతిధ్వని
నీ అగ్ని ఎన్నాళ్లుగానో గుండెలో దాచుకున్న గగ్గోలు.
నీ దహనంలో నిలిచింది ఒక ధర్మం,
నీ నిశ్శబ్దంలో గర్జించింది ఒక రణం!

అది పెట్రోల్ జ్వాల కాదు చారి
అది శతాబ్దాల నిస్సహాయతకు ప్రతిస్పందన.
దోచుకున్న వాటాకై, దహించుకున్న గౌరవంకై
ఒక్క యువ హృదయం చరిత్ర ముందుంచిన త్యాగ సంకేతం!

"మా వాటా.. మా హక్కు మా గౌరవం"
అని అరిచిన కంఠధ్వనిని వినని చెవులపై
అగ్నిరూపంలో పడిన నిప్పు కణం నువ్వు చారి.

బీసీ చరిత్రలో నీ పేరు అగ్నివర్ణంతో చెక్కబడింది
బీసీ భవిష్యత్తులో నీ నినాదం మంటగా ఊపిరిగా నిలిచిపోతుంది.

మా కన్నుల్లో నువ్వు మరణించలేదు చారి
మా రగిలే పోరాటంలో పునర్జన్మిస్తున్నావు
మా ఉద్యమ రాగాల్లో జేజెలాడుతున్నావు
మా ఐక్యతా జ్యోతిలో వెలుగుతున్నావు

నీ త్యాగం ఆఖరి కాదు ఇది ఉద్యమానికి నూతన ఆరంభం!
నీ జ్వాల మా దిక్సూచి, నీ రక్తం బీసీ హక్కుల దీపారాధన!

జ్వలించు చారి.. బీసీ ఉద్యమాల అజర అమర జ్యోతిగా
మా అరుపులకు అగ్నిగా
మా పోరాటాలకు పునర్నవ దారిగా
జ్వలించు చారి..జ్వలించు..
జోహార్ సాయి ఈశ్వరాచారి జోహార్ జోహార్

డా. చిర్ర రాజు గౌడ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం పార్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు కాకతీయ విశ్వవిద్యాలయం.




# ఏం సాధించారని సంబరాలు?

**కాంగ్రెస్ ప్రభుత్వంపై డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ తీవ్రమైన ఆరోపణలు**

**హైద్రాబాద్, 8 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా పూర్తి చేయకుండా రెండేళ్ల పాలనను సంబరాలతో జరుపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి అధికార ప్రతినిధి డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ తీవ్రంగా మండిపడ్డారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి గ్లోబల్ సమ్మిట్ పేరుతో తెలంగాణను 2047 నాటికి దేశానికి గ్రోత్ ఇంజన్‌గా మార్చుతామని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. "రెండేళ్లలో ఒక్క అభివృద్ధి పని చేయని ప్రభుత్వం ఎలా గ్రోత్ ఇంజన్ అవుతుంది?" అని ప్రశ్నిస్తూ, ప్రజలను మోసగించడమే కాంగ్రెస్ లక్ష్యమని ధ్వజమెత్తారు. ఫ్యూచర్ సిటీ అంటూ ప్రచారం చేస్తూ వాస్తవానికి ఏ పురోగతీ చూపించలేకపోతున్నారని ఆయన అన్నారు. రైతులు, విద్యార్థులు, ఉద్యోగులందరి పరిస్థితి దయనీయమే... రైతులకు ఎరువులు, యూరియా అందక ఇబ్బందులు పడ్డా ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సూదీలు, మందులు కూడా అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడంతో జీవనం కష్టసాధ్యంగా మారిందని అన్నారు. యువతపై ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ, జాబ్ క్యాలెండర్ పేరుతో వారికి కేవలం మోసం మాత్రమే జరిగిందని, ఉద్యోగాలేమీ రావడంతో నిరాశలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని దుఃఖం వ్యక్తం చేశారు. గురుకులాల్లో కనీస ఆహార వసతులు లేని పరిస్థితిని ఉదాహరణగా చూపించారు. ఉద్యోగులు, పెన్షనర్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు కూడా సమయానికి ఇవ్వలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, గ్యాస్ సబ్సిడీలు నిలిపివేసి, కొత్త రేషన్ కార్డులను అడ్డుకోవడం ద్వారా ప్రజలను ఆర్థికంగా మరింత కుంగదీస్తోందని విమర్శించారు.

**దావోస్ ఒప్పందాలపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి..**

దావోస్‌లో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు ఏ ప్రయోజనం కోసం అన్నది ఇప్పటికీ ప్రజలకు తెలియదని, ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని శ్రీకాంత్ గౌడ్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, బాలికల హాస్టళ్లలో వసతులు వంటి ప్రాథమిక అంశాలపై కూడా ప్రభుత్వం స్పందించలేని స్థితిలో ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బీసీ రిజర్వేషన్లపై మోసం ు తెలంగాణ తల్లి విగ్రహాలపై అనుమతి లేదంటూ హెచ్చరిక..**

బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలతో మోసం చేస్తోందని తీవ్రమైన ఆరోపణలు చేశారు. ప్రజల ఆమోదం లేని తెలంగాణ తల్లి విగ్రహాలను ఏర్పాటు చేయడాన్ని జాగృతి వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. "తెలంగాణ అస్తిత్వం, గౌరవాన్ని దెబ్బతీయాలంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకోము" అని హెచ్చరించారు. అలాగే ఏపీపి పరీక్షలను వాయిదా వేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయక, ఖాళీ సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని డాక్టర్ శ్రీకాంత్ గౌడ్ వ్యాఖ్యానించారు. "ఇది రైజింగ్ సర్కార్ కాదు.. లూజింగ్ సర్కార్" అని ఎద్దేవా చేశారు.

# పిఎంఎవై పోర్టల్‌లో లబ్ధిదారుల వివరాలు గడువులోగా నమోదు చేయాలి

**జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**



**వరంగల్, 08 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

పిఎం ఆవాస్ యోజన (పిఎంఎవై) పోర్టల్‌లో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలను నిర్దేశిత గడువులోగా తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులు ఆదేశించారు. సోమవారం కలెక్టర్ డా. సత్య శారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, సంబంధిత విభాగాల అధికారులతో కలిసి వరంగల్‌లోని పైడిపల్లి, దేశాయిపేట, తిమ్మాపూర్, దూపకుంట ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న రెండు పడకగదుల ఇళ్లను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారుల వివరాల నమోదు కోసం సంబంధిత అధికారులు సూచించిన పారామీటర్లను ఖచ్చితంగా అనుసరించాల్సిన అవసరం ఉందని సూచించారు. అలాగే రెండు పడకగదుల ఇళ్లలో శుభ్రత, తాగునీటి సరఫరా, విద్యుత్ వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా సిద్ధం చేసి లబ్ధిదారులకు అందుబాటులో ఉంచాలని ఆమె సూచించారు. పరిశీలన కార్యక్రమంలో బల్దియా సిఎంహెచ్‌ఓ డా. రాజారెడ్డి, ఆర్&బి ఈఈ రాజేందర్, ఎన్‌పిడిసిఎల్ ఎస్‌ఈ మధుసూదన్, ఆర్‌డిఓ సుమా, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఈఈలు సంతోష్ బాబు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ సుమంత్ టెంట్ హౌస్ ప్రారంభంలో ప్రజా ప్రతినిధుల సందడి

**హసన్‌పర్తి, 8 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి వాస్తవ్యులు పెద్దమ్మ శ్రీనివాస్ గారి అన్నకొడుకు పెద్దమ్మ సుమంత్ ప్రారంభించిన శ్రీ వెంకటేశ్వర టెంట్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 66వ డివిజన్ కార్పొరేటర్ శ్రీ గురుమూర్తి శివకుమార్ శుభాకాంక్షలు తెలియజేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో మాజీ ఎంపిటిసి పిట్టల కుమారస్వామి, మండల అధ్యక్షులు మారం తిరుపతి, మాజీ మార్కెట్ డైరెక్టర్ చకిలం రాజేశ్వరరావు, హనుమండ్ల విద్యాసాగర్, శీలం బిక్షపతి, దాడి రాజు, పెద్దమ్మ నాగరాజు, మారం కుమారస్వామి (జేసీబీ), కోరె కుమారస్వామి, పెద్దమ్మ కుమారస్వామి, ఆలేటి అశోక్, సుధాకర్, దాడి చిరంజీవి, ప్రశాంత్, కుంబర్కర్ సాయి, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య

**ప్రేమ పెళ్లి తగాదా నేపథ్యంలో కిరాతకం**

**హైద్రాబాద్, డిసెంబర్ 8 (జై భీమ్ న్యూస్)**

సికింద్రాబాద్ వారాసిగూడలో ఇంటర్ చదువుతున్న యువతిపై ప్రేమోన్మాది అతి దారుణంగా దాడి చేసి హత్య చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పెళ్లి చేసుకోవాలన్న తన మాట వినలేదనే కక్షతో నిందితుడు ఉమాశంకర్ యువతి పవిత్రను కత్తితో గొంతు కోసి చంపి పారిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం%ొ% శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన పవిత్ర కుటుంబంతో కలిసి వారాసిగూడలో నివాసం ఉంటోంది. ఇంటర్ చదువుతున్న ఆమెకు బాలాజీ నగర్‌కు చెందిన టైల్స్ పనివాడు ఊమాశంకర్‌తో కొంతకాలంగా పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారిందని తెలిసింది. ఇటీవల పవిత్ర తన తల్లిదండ్రులతో కలిసి విజయవాడ వెళ్లడాన్ని ఉమాశంకర్ వ్యతిరేకించాడు. వెళ్లొద్దు అని చెప్పినా వినలేదని ఆగ్రహం పెంచుకున్నాడని పోలీసులు తెలిపారు. తిరిగి వచ్చిన పవిత్రతో 'పెళ్లికి ముందు నుంచే ఇన్ని ఆంక్షలేనా?' అంటూ ఆమె వాగ్వాదానికి దిగినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పవిత్ర పెళ్లికి నిరాకరించడంతో ఉమాశంకర్ ఆమెను హత్య చేయాలని ???ంచినట్టు తెలుస్తోంది. సోమవారం మధ్యాహ్నం పవిత్ర ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఉమాశంకర్ నేరుగా అక్కడికి వెళ్లి గొడవపడి, ఇంట్లో ఉన్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావంతో పవిత్ర అక్కడికక్కడే మృతిచెందింది. అనంతరం తన మొబైల్ అక్కడే వదిలేసి నిందితుడు పరారయ్యాడు. బాధిత యువతి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని పోలీసులు తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# గంగవరం పోర్టు వద్ద మత్స్యకారుల ధర్నా

బకాయిలు చెల్లించాలంటూ ఆందోళన

**విశాఖపట్టణం,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

గంగవరం పోర్టు గేటు వద్ద నిర్వాసిత మత్స్యకారులు సోమవారం ఆందోళన చేపట్టారు. తమకు రావల్సిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ . నిర్వాసిత మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. గంగవరం పోర్టు గేటును తీసి లోపలికి వెళ్లడానికి మత్స్యకారులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగింది. గంగవరం పోర్టులోని 499 మంది కార్మికులకు ఒక్కొక్కరికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.2 లక్షలు ఇవ్వడానికి ఏడాది క్రితం యాజమాన్యం ఒప్పందం చేసుకుంది? కానీ వీటి చెల్లింపుల్లో ఆలస్యం చేసింది. అయితే పన్నుల రూపంలో డబ్బులు అయిపోయాయంటూ ?. అధికారులు సాకులు చెబుతున్నారని తమ బకాయిలను ఇవ్వడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఈరోజు ఉదయం కార్మికులంతా గేటు వద్దకు వచ్చారు. అప్పటికే పోలీసుల బలగాలు అక్కడున్నాయి. కార్మికుల ధర్నా తీవ్రతరం కావడంతో యాజమాన్యం స్పందించి కార్మిక నాయకులను చర్చలకు పిలిచింది. వివిధ అంశాలపై వారితో అధికారులు చర్చిస్తున్నారు.

# మున్సిపల్ కార్యాలయానికి తాళం

గోరిసత్తిబాబుపై చర్యకు ఫిర్యాదు

**భీమవరం,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

పశ్చిమ గోదావరి నరసాపురం మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి కౌన్సిల్ సభ్యులను నిర్బంధించిన గోరి సత్తిబాబు పై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ, వైసీపీ కౌన్సిల్ సభ్యులు కోరారు. సోమవారం నరసాపురం డీఎస్పీ డా.జి.శ్రీవేద, భీమవరం పీజీఆర్ఎస్ లో జేసీ రాహుల్ కుమార్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ నెల 6వ తేదీన కౌన్సిల్ కు సంబంధం లేని గోరి సత్తిబాబు తాళం వేసి, పెట్రోల్ పోసి అంటించేస్తానని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

పండించే ప్రతి గింజకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు

ఎస్.కోట నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి

**విజయనగరం,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే తమ ప్రధాన ధ్యేయమని, రైతులు పండించే ప్రతి గింజకు గిట్టుబాటు ధర లభించేలా కట్టుబడి ఉందని ఎస్.కోట నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి తెలిపారు. వేపాడ మండలం కేజీపూడిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లలిత కుమారి మాట్లాడుతూ  పంటకు సరైన మద్దతు ధర అందించడం కోసం ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. రైతు ధాన్యం విక్రయించిన 48 గంటల్లోపే చెల్లింపు నేరుగా రైతు బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని స్పష్టం చేశారు.దళారులకు అవకాశం లేదు : దళారుల జోక్యం లేకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోలు జరుగుతుందని, దీంతో రైతులకు పూర్తి లాభం చేకూరుతుందని కోళ్ల లలిత కుమారి తెలిపారు. అధికారులు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యాన్ని వెంటనే సేకరించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఏఓ స్వాతి, ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, మాజీ సర్పంచ్ గోలగాని కృష్ణ మూర్తి, మాజీ సర్పంచ్ చల్లా వెంకటరావు, జగదీశ్ పరవాడ, బూత్ ఇంచార్జ్ మమ్ములూరి సూర్యనారాయణ, సింహాద్రి, సత్తిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు రొంగలి పోలినాయుడు, ఎన్డీయే కూటమి నాయకులు, స్థానిక అధికారులు, వరి రైతులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రివిలేజ్ వ్యవహారం

ఎమ్మెల్యేల పట్ల అగౌరవం తగదని కమిటీ హెచ్చరిక

**అమరావతి,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

అసెంబ్లీ కమిటీ హాల్‌లో ప్రివిలేజ్ కమిటీ సోమవారం భేటీ అయ్యింది. ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ పితాని సత్యనారాయణ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి విషయంలో ప్రోటోకాల్ పాటించడంలో నిర్లక్ష్యంపై కమిటీ విచారించింది. రిమ్స్‌లో క్యాథ్లాబ్ ప్రారంభోత్సవ శిలా ఫలకంలో ఎమ్మెల్యే పేరు లేకపోవడంపై చర్చ జరిగింది. ఈ వ్యవహారానికి సంబంధించి అప్పటి మెడికల్ సూపరింటెండెంట్, డీఆర్వోను కమిటీ ప్రశ్నించింది. గత వాయిదాకు ఇరువురు హాజరుకాకపోవటంపై తీవ్రంగా మందలించింది. ప్రభుత్వం మారిందనే స్పృహ లేకుండా పనిచేస్తున్నారా అని కమిటీ మండిపడింది. తీరు మారకుండా ఎమ్మెల్యేల పట్ల అగౌరవంగా ఉంటున్నారని కమిటీకి మాధవీ రెడ్డి ఫిర్యాదు చేశారు. జరిగిన తప్పును అంగీకరించి కమిటీకి నాటి సూపరింటెండెంట్ క్షమాపణలు చెప్పారు. తప్పు పునరావృతం కాకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. అయితే ఈ వ్యవహారంపై పొంతన లేని సమాధానాలు చెప్పిన నాటి డీఆర్వోపై కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోసారి విచారణకు రావాలని ఇరువురునీ ఆదేశించింది. అలాగే 2019-24 మధ్య ఎమ్మెల్యేగా తనకు జరిగిన ప్రోటోకాల్ ఉల్లంఘనలపై జోగేశ్వరరావు ఇచ్చిన ఐదు ఫిర్యాదులపైనా కమిటీ చర్చించింది. ఐదు ఫిర్యాదులపై నాటి అసెంబ్లీ సిబ్బంది నోటీసులు కూడా పంపకపోవటంపై కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. నాటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి తలొగ్గే ప్రోటోకాల్ పాటించలేకపోయామని అధికారులు వివరణ ఇచ్చారు. కమిటీని క్షమాపణలు కోరి, తప్పు పునరావృతం కాకుండా చూసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

# ఎన్నికల వేళ శాంతి.. ఐక్యతపై పిలుపు

**హైద్రాబాద్, 8 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

గ్రామంలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల సందర్భంగా గ్రామంలో శాంతి, భద్రత, సామరస్య వాతావరణం కొనసాగించాలని గ్రామ పెద్దలు, చదువుకున్న యువత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమైనప్పటికీ, గ్రామీయ బంధాలు, పరస్పర నమ్మకం, సాన్నిహిత్యం ఎట్టి పరిస్థితుల్లో చెడిపోరాదని వారు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర బిజి హ్యూమన్ రైట్స్ ఆంటీ కరప్షన్ సంస్థ ప్రధాన కార్యదర్శి అనిల్ కాందారి మాట్లాడుతూ, అంబాలలో నివసించే వారి మధ్య బంధుత్వం, అనుబంధం బలంగా ఉన్నందున బయటివారి ప్రేరేపణకు లోనై విభేదాలు పెరగడం గ్రామానికి మంచిది కాదని తెలిపారు. "బయటివారు మాట్లాడి వెళ్తారు%ో% కానీ సమస్యలు, గొడవలు మాత్రం గ్రామానికే మిగులుతాయి" అనే అభిప్రాయం గ్రామస్తుల మధ్య చర్చనీయాంశమైంది. ఎన్నికల సమయంలో చిన్న మాటలు కూడా పెద్ద విభేదాలకు దారి తీసే అవకాశం ఉండటంతో, ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవంతో వ్యవహరించాలని ఆయన సూచించారు. ఎన్నికల తర్వాత ఎవరైనా గెలిచినా, ఎవరు ఓడిపోయినాఅందరూ గ్రామానికి చెందిన వారేనని గుర్తుచేస్తూ, ఐక్యత దెబ్బతినకుండా జాగ్రత్త పడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియను పండుగలా, ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు ప్రతి ఓటరు సహకరించాల్సిన అవసరం ఉందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఎన్నికలు తాత్కాలికం కాని గ్రామీయ బంధాలు శాశ్వతమని వారు స్పష్టం చేశారు. అలాగే ఎన్నికల సమయంలో లంచాలు, ప్రలోభాలకు దూరంగా ఉండి, స్వంత నిర్ణయంతో ఓటు హక్కును వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామ భవిష్యత్తు, అభివృద్ధి దృష్ట్యా ఓటు ఒక బాధ్యతగా చూడాలని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గ్రామంలో శాంతి, ఐక్యత, పరస్పర నమ్మకం కొనసాగాలని గ్రామ పెద్దలు, యువత ఆకాంక్ష వ్యక్తం చేశారు.



# పెట్టుబడులు అంటూ ఊదరగొట్టిన బాబు

సిఎం అయిన నాటి నుంచీ ఇదే వరస

పెట్టుబలు పేరుతో ప్రజలకు కుచ్చుటోపి

సిపిఎం పొలిట్ బ్యూరోసభ్యులు బివిరాఘవులు ఎద్దేవా

**విశాఖపట్టణం,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

రాష్ట్రం పారిశ్రామికంగా శరవేగంగా ముందుకెళ్లిపోతుందని రూ.లక్షల కోట్లు పెట్టుబడులు, లక్షల ఉద్యోగాలంటూ చంద్రబాబు ప్రభుత్వం కబుర్లు ఎక్కువగా చెప్పి అందుకు తగ్గట్టు కార్యాచరణ లేకుండా వ్యవహరిస్తుందని సిపిఎం పొలిట్ బ్యూరోసభ్యులు బివిరాఘవులు ఎద్దేవా చేశారు. ఈ కబుర్లు ఈనాటివి కావని సిఐఐ సమ్మిట్లతో రూ.లక్షల కోట్లు వచ్చి పడిపోతున్నాయని చంద్రబాబు ముఖ్యమంత్రిగా తొలినుంచీ ఇవే చెబుతున్నారన్నారు. విశాఖలోని జగదాంబ సిఐటియూ కార్యాలయంలో సోమవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన మీడియా సమావేశంలో రాఘవులు మాట్లాడారు. గతంలో వేల ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకున్న కార్పొరేట్ల వల్ల ఏం ఒరిగిందని ఆ భూముల్లో గడ్డి తుప్పలు మాత్రమే మొలిచాయని ఏ పరిశ్రమా రాలేదని వ్యాఖ్యానించారు. భూముల కోసం తప్ప పెట్టుబడి ఆసక్తి కనిపించడం లేదన్నారు. పైగా దేశంలోనే విదేశీ పెట్టుబడులు గడచిన 2 ఏళ్లలో రాష్ట్రానికి వచ్చిందేమీ లేదన్నారు. ఐటి మంత్రి లోకేష్ కూడా గడచిన 17 నెలల్లో రూ.20లక్షల కోట్లు పెట్టుబడులను ఆకర్షించామనడం ఈ డబ్బంతా ఎక్కడికి వెళ్లిపోయిందో చెప్పాలని నికరమైన కార్యాచరణ బదులు ఊదరగొట్టడం బాబు, పవన్, లోకేష్‌కు అలవాటుగా మారిందని రాఘవులు వ్యాఖ్యానించారు. 2014-2024 మధ్యకాలంలో రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చింది 1.2 బిలియన్ డార్లేనన్నారు. రాగల 5ఏళ్లలో అంటే 2024-2029నాటికి 500 బిలియన్‌లు వస్తాయన్న ప్రచారం 'హెచ్చులు'గా కొట్టిపారేశారు. భూములు తీసుకోడానికి ఊదరగొట్టడం తప్ప ఇంకేమీ కాదన్నారు. 20ఏళ్ల క్రితం రైతుల నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఆదానీ కోసం 2800 ఎకరాలు, కాకినాడలో సెజ్‌ల కోసం 10వేల ఎకరాలు, అనంతపురంలో 8వేల ఎకరాలు లేపాక్షి కోసం, ప్రకాశం జిల్లా వినుకొండలో 30వేల ఎకరాలు ఇచ్చిన సంగతిని ఉటంకిస్తూ ఈ భూములన్నీ పెట్టుబడిదారుల స్పెక్యులేషన్ వ్యాపారానికి వాడుకున్నారు తప్ప ఈ ప్రాంతాల్లో ఏ పరిశ్రమ వచ్చిందని, భూములిచ్చిన రైతులకు ఏం పరిహారం ఇచ్చారంటూ ప్రశ్నించారు. డేటా సెంటర్లు అవసరమే కాని అందులో వచ్చే ఉద్యోగాలు 300 కంటే మించవని, గూగుల్‌కి చౌకగా నీరు, విద్యుత్ ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు పేరుతో గాలి, నీరు వారి ప్రయోజనం కోసం తప్ప ఉపాధి కల్పించేవి కాదన్నారు. ఆదానీ కోసమో టాటా కోసమో కాదని, రాష్ట్రం కోసం నిజంగా ఉపాధి కల్పించాలనుకుంటే ప్రపంచంలో ఉపాధి సృష్టించగల ఫుట్‌వేర్, గార్మెంట్, టెక్స్‌టైల్ ఇండస్టీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు పెట్టాలని రాఘవులు డిమాండ్ చేశారు. కాబట్టి ఇప్పటికే సేకరించిన భూములపై పరిశ్రమలు పెట్టేందుకు కేంద్రీకరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం సలహాఇస్తుందన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం భూములు ఇవ్వాలే తప్ప అది ఆ భూములిచ్చే రైతులకూ ఉపయోగపడాలన్నారు. చంద్రబాబు పాలనలో ఏపి అభివృద్ధి సాధిస్తుందన కబుర్లు నిజం కావని, తెలంగాణ విడిపోయిన తర్వాత ఆ రాష్ట్రం కూడా అభివృద్ధి అయ్యిందేమీ లేదన్నారు. మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, గుజరాత్, యూపి దేశంలో ముందుకెళు_న్నాయి కానీ ఎక్కువ కాలం చంద్రబాబు సిఎంగా ఉండి ఇంకా కబుర్లు చెప్పడం సరైంది కాదన్నారు. విశాఖ స్టీల్‌ఎ÷-లాంట్‌ను ఇంకా దిగజార్చి, కార్మికుల జీతాల్లో కోత పెట్టడానికే యాజమాన్యం ఉత్పత్తితో లింకు పెట్టి ఉద్యోగాలను కార్మికులు అంతిమంగా వదులుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం చేస్తున్నాయని మండిడ్డారు. ప్రభుత్వ రంగంలో ఉంటుందని చెబుతూనే ఎ÷-లాంట్‌కి అన్ని నాశిరకం ముడిపదార్థాలే సరఫరా చేస్తుందని సున్నపురాయయి, ఇనుపు ఖనిజం, పె÷-లలెట్స్ అన్నీ నాశిరకమేనన్నారు. నాణ్యత ఉక్కు ఉత్పత్తి చేయలేకపోతున్నారంటూ నింద మోపడం సరికాదన్నారు. ఉద్యోగులను నైతికంగా దెబ్బతీసే కుట్రలను యాజమాన్యం కొనసాగిస్తుందని నాలుగునెలల జీతాలు రూ.400కోట్లు బకాయి పెట్టిందన్నారు. ఇలా పొగపెట్టి పొమ్మనేలాగ చేస్తుంటే అనివార్యంగా ఉద్యోగులు బయటకు పోతున్న స్థితి నెలకొందన్నారు. నిర్వాసితుల భూమిని ఎ÷-లాంట్ కోసం ఇచ్చారని దీంట్లో వేల ఎకరాలు ఉపయోగంలో లేదని, 8వేల మందికి ఇంకా ఉపాధి కూడా ఇవ్వలేదని భూమైనా ఇవ్వండి, ఉపాధైనా కల్పించండని నిర్వాసితుల డిమాండ్ న్యాయమైనదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిర్వాసితుల సమస్యను పరిష్కరించడానికి చర్చలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాఘవులు డిమాండ్ చేశారు. కీలక రంగాల్లో ప్రభుత్వ నియంత్రణలో ఉండాలి: విమానయాన సంక్షోభంపై రాఘవులు ÷శిశంలోని కీలక రంగాల్లో ప్రభుత్వ ఆధిపత్యం ఉండి తీరాలని ప్రైవేట్ వాళ్ల పెత్తనానికి వదిలేస్తే తాజాగా నెలకొన్న విమానయాన రంగం ఎలా కకావికలం అయ్యిందో దేశం అంతా చూస్తున్నామన్నారు. ఇది కచ్చితంగా పాలకవర్గ విధానాల వల్ల వచ్చిన సంక్షోభమని రాఘవులు ఎద్దేవా చేశారు. కేంద్రం 2 ఏళ్ల క్రితమే పైలట్‌లు ఎలా ఉండాలో నిబంధనలు జారీచేసిందని ఇండిగో వాటిని అమలు చేయలేదన్నారు. అయినా కేంద్రం తగిన రీతిలో స్పందించకపోవడం వెనుక ప్రైవేట్ విమాన యాన సంస్థతో కుమ్మక్కయిందా? అని ప్రశ్నించారు. ఇదే అదనుగా మరో ఎయిర్‌లైన్స్ టాటా ఎయిర్ ఇండియా ప్రస్తుతం రూ.10వేలున్న టికెట్‌ను లక్ష చేసి వ్యాపారం చేసుకోవడం చూస్తే ప్రైవేట్ ఆధిపత్యం ఎంత ప్రమాదమో స్పష్టమవుతుందన్నారు.

# సబ్సిడీ రుణాల మంజేరులో నిర్లక్ష్యం

ఏపీఐఐసీ భవనం వద్ద ఆందోళన

నల్ల కండువాలతో ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తల నిరసన

**మంగళగిరి,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

ఎం ఎస్ ఎం ఈ ద్వారా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సబ్సిడీల ద్వారా రుణాలు మంజూరు చేయకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2021వ సంవత్సరం నుండి 2025 వ సంవత్సరం వరకు 100 శాతం సబ్సిడీలు మంజూరు చేయకపోవడంతో గత ఐదు రోజుల నుండి ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో ఏపీఐఐసీ భవనం వద్ద ఆందోళన చేపట్టారు. నల్ల కండువాలతో సోమవారం ఆందోళన తీవ్రత పెరగడంతో ఏపీఐఐసీ భవనం లోపలకు పోనివ్వకుండా గేటు వద్దే పోలీసులు నిలిపియడం జరిగింది. దీంతో ఎస్సీ ఎస్టీ మహిళ, పురుషుల పారిశ్రామికవేత్తలు గేటు వద్దే మెడలో నల్ల కండువాలు వేసుకొని ఆందోళన చేస్తున్నారు. ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలకు గత ఐదు సంవత్సరాల నుండి ఇవ్వవలసిన సబ్సిడీలు ఇచ్చేంతవరకు ఇక్కడే ఉంటామని కూర్చున్నారు. ఎం ఎస్ ఎం ఈ ద్వారా ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు లారీలు, ట్రాక్టర్లు, టిప్పర్లు తీసుకోవడం జరిగింది. బ్యాంకులకు కట్టవలసిన ఈఎంఐలు చెల్లించకపోవడంతో వాహనాలను సీజ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ అప్పులు పుట్టక, తినడానికి తిండి లేక పస్తులతో అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఏపీఐఐసీ భవనం గేటు వద్ద ఆందోళన చేస్తూ 100? సబ్సిడీలు ఇస్తారా? లేక ఆత్మహత్యలు చేసుకోమంటారా అంటూ రోదిస్తున్నారు. గత నాలుగు రోజులుగా భవనం ఎదుట కూర్చోవడం జరిగిందని, పారిశ్రామికవేత్తలు ఒక్కసారిగా రాష్ట్రవ్యాప్తంగా 200 మంది పైగా రావడంతో పోలీసులు లోపలికి పోనివ్వకుండా అడ్డగించడంతో గేటు వద్ద కూర్చొని ఆందోళన చేస్తున్నారు. కట్టు బట్టలతో పారిశ్రామికవేత్తలంతా తాడోపేడో తేల్చుకోవడానికి ఇక్కడకు వచ్చారు. ఇచ్చేంతవరకు ఇక్కడ నుండి కదిలేది లేదని ఆందోళన చేస్తూ నినాదాలు చేస్తున్నారు. ఎం ఎస్ ఎం ఈ ఓ ఎస్ డి వచ్చి చర్చలు జరిపినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. చర్చల్లో ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలు కంపెనీలకు 100? సబ్సిడీలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఆధారాలతో సహా తమ దగ్గర ఉన్నాయని చూపించారు. అయితే ఓ ఎస్ డి మాత్రం అలాంటిదేమీ జరగలేదని మాట్లాడుతుండగా ఒకసారిగా అంతా లేచి జరిగిందని, ఫోన్ లో ఉన్న సమాచారాన్ని చూపించడం చేశారు. దీంతో ఓ ఎస్ డి ఏమి చేయలేక ఒక గంట తర్వాత మాట్లాడదామని చెప్పి వెళ్ళిపోయారు. గత నాలుగు రోజులుగా ఇక్కడే ఉంటూ నిరసన తెలియజేస్తున్న నాగలక్ష్మి అనే మహిళ శ్రామికవేత్త సోమవారం స్పృహ తప్పి పడిపోయింది. దీంతో కాసేపు పోలీసులు హడావుడి చేశారు. అయితే నిమ్మరసం, మంచినీళ్లు తాగడం వల్ల మరలా లేసి కూర్చుంది. ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఇవ్వవలసిన సబ్సిడీలు 100 శాతం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న పారిశ్రామికవేత్తలకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కే జీవన్ సాగర్, కే రాధిక ఏపీఐఐసీ భవనం వద్దకు వచ్చి మద్దతు తెలియజేశారు. పాలక పార్టీలు వైసీపీ అయిన, కూటమి ప్రభుత్వమైన దళిత, ఎస్టీలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. 100? సబ్సిడీ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పోలీసుల అదుపులో వల్లభనేని వంశీ అనుచరుడు

సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఏ2గా ఉన్న కొమ్మా కోట్లు

**విజయవాడ,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ కీలక నేత వల్లభనేని వంశీమోహన్‌కు బిగ్ షాక్ తగిలింది. వంశీ ప్రధాన అనుచరుడు కొమ్మా కోట్లును విజయవాడ పటమట పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో ఏ2గా ఉన్నారు కొమ్మా కోట్లు.గత కొంతకాలంగా ఆయన అజ్ఞాతంలో ఉంటున్నట్లు తెలుస్తోంది. ఎట్టకేలకు కొమ్మా కోట్లును పటమట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, కొమ్మా కోట్లును అరెస్ట్ చేసినట్లు చూపనున్నారు పోలీసులు. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించిన అనంతరం కోర్టుకు పోలీసులు తీసుకువచ్చారు. న్యాయాధికారి ముందు కొమ్మా కోట్లును హాజరు పరిచారు పోలీసులు. ఈ సందర్భంగా కొమ్మా కోట్లు మీడియాతో మాట్లాడారు. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో తన ప్రమేయం ఏమీ లేదని కొమ్మా కోట్లు స్పష్టం చేశారు. తాను ఏ తప్పూ చేయలేదని, తన మీద పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పుకొచ్చారు. అందువల్లే ఈరోజు పటమట పోలీస్టేషన్‌కు వచ్చి తాను లొంగిపోయానని తెలిపారు. కోర్టులో తనకు న్యాయం జరగుతుందనే నమ్మకం ఉందని కొమ్మా కోట్లు పేర్కొన్నారు.

# మరోమారు దావోస్‌కు చంద్రబాబు

జనవరి 19 నుంచి 23వ పర్యటన

**అమరావతి,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. వచ్చే ఏడాది జనవరి 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దావోస్‌లో ముఖ్యమంత్రి పర్యటించనున్నారు. దావోస్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరు కానున్నారు. చంద్రబాబు బృందంలో మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ ఉన్నారు. ఈ మేరకు సీఎం దావోస్ పర్యటన షెడ్యూల్‌ను అధికార వర్గాలు ఖరారు చేశారు. సోమవారం దావోస్ పర్యటనకు సంబంధించిన ప్రకటన విడుదల చేశారు. అయితే దావోస్ పర్యటనలో పలువురు పారిశ్రామికవేత్తలను కూడా సీఎం కలిసే అవకాశాలు ఉన్నాయి. ఏపీకి కావాల్సిన పెట్టుబడులపై పారిశ్రామిక వేత్తలతో చంద్రబాబు చర్చించే ఛాన్స్ ఉంది. ఏపీ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ఇప్పటికే అమెరికాలోని డల్లాస్‌లో లోకేశ్ పర్యటిస్తున్న విషయం తెలిసిందే.

# ఐదేళ్ల జగన్ పాలనలో సర్వనాశనం

**వ్యవస్థలను దెబ్బతీసిన వైకాపా పాలన**
**కొన్ని కంపెనీలు రాష్ట్రాన్ని వీడాయి**
**ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ పూర్తిగా దెబ్బతింది**
**ఒక్కో రంగాన్ని గాడిన పెడుతూ వస్తున్నాం**
**ఆర్థిక నివేదికను విడుదల చేసిన సిఎం చంద్రబాబు**

**అమరావతి,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

వైకాపా ఐదేళ్ల పాలనలోఅభివృద్ధి ఆగిపోవడమే గాకుండా ఎపి బ్రాండ్ పూర్తిగా దెబ్బతిందని, ఆదాయం తగ్గిపోయిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్ని రంగాలు పూర్తిగా ధ్వసం అయ్యాయని, వ్యవస్థలు దెబ్బతిన్నాయని అన్నారు. వైకాపా పాలన దెబ్బకు ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ దెబ్బతిన్నది. ఆ పార్టీ చేసిన దారుణాల వల్ల కొన్ని కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయి. ఇప్పుడు అన్ని వ్యవస్థలను చక్కదిద్దుతూ అభివృద్ధి కొనసాగిస్తున్నాం అని వివరించారు. విధ్వంసమైన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ అనేక విజయాలను చవిచూసిందని.. కానీ 2024 విజయం.. నమ్మకం, విశ్వాసం మీద వచ్చిందని తెలిపారు. సూపర్ సిక్స్‌ను సూపర్ హిట్ చేశామన్నారు. పరీక్ష రాసినప్పుడు పిల్లలు ఎంత టెన్షన్‌గా ఉంటారో తాము అంతే టెన్షన్‌గా ఉంటామని చెప్పుకొచ్చారు. జీఎస్డీపీ విషయంలో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఈ రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టగలు గుతారా? అనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని.. అయితే ప్రస్తుత పరిస్థితి చూసి పారిపోమని ప్రజలకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.ప్రస్తుతం ఓ వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం కేంద్ర పథకాల్లో అవకతవకలకు పాల్పడిందని, కేంద్ర నిధులను ఇతర పథకాలకు మళ్లించిందని అన్నారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం గతంలో రూ.9వేల కోట్లు ఖర్చు చేశారు. ఇప్పుడు విద్యుత్ ఛార్జీలు పెంచకుండానే విద్యుత్ రంగాన్ని సమర్థంగా నిలబెడుతున్నాం అని అన్నారు. వచ్చే ఏడాది కూడా విద్యుత్ రంగంలో సమర్థత పెంచుకుంటాం. సాగు నీటి పంట గుంటలు తవ్వడంతోపాటు, చెక్ డ్యామ్‌లు కట్టాం. ఇంగ్లీష్ మీడియం పేరుతో విద్యా వ్యవస్థలో కూడా గతంలో డ్రామాలు చేశారు. విద్యా వ్యవస్థలోని బిల్లులు అన్నీ పెండింగ్‌లో పెట్టారు. వైకాపా ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చి వెళ్లిందని చంద్రబాబు దుయ్యబట్టారు.ప్రతి త్రైమాసిక, ఆర్థిక ఏడాది రాష్ట్ర స్థూల ఉత్పత్తి పర్యవేక్షిస్తున్నాం. ప్రజల కోసం ఎంత కష్టమైనా సరే బాధ్యత తీసుకొని అభివృద్ధి చేస్తాం. ఆస్తులు, భవిష్యత్ ఆదాయాన్ని తాకట్టు పెట్టి గతంలో అప్పులు తెచ్చారు. మూలధన వ్యయం చేయకపోవడంతో గతంలో ప్రాజెక్టులు ముందుకెళ్లలేదు. కూటమి అధికారంలోకి వచ్చాకే స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రాజెక్టులపై మూలధన వ్యయం పెంచి ప్రాజెక్టులు చేపట్టాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజల చేతుల్లోకి పాలన తీసుకెళ్లాం. వైకాపా హయాంలో పీపీఏల రద్దుతో విద్యుత్ వాడకుండానే రూ.9 వేల కోట్లు వ్యయం చేశారు. కక్షపూరిత రాజకీయాలతో గత పాలకు ప్రజాధనాన్ని వృథా చేశారు. 2014-19 మధ్య 13.5 శాతంగా వృద్ధిరేటు ఉండేది. 2019-24 మధ్య కాలంలో అది 10.32 శాతానికి పడిపోయింది. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సంస్కరణలు తెచ్చాం. పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నాం అని చంద్రబాబు తెలిపారు. నాడు సూపర్ సిక్స్ తీసుకువచ్చామని... అయితే అభివృద్ధికి నిధులు లేవన్నారు. క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్ బాగా తగ్గి అభివృద్ధి లేకుండా పోయిందని వెల్లడించారు. తరువాత అన్ని వ్యవస్థలను గాడిన పెట్టామన్నారు. క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్‌ను బాగా పెంచామని.. సుపరిపాలనకు టెక్నాలజీని అభివృద్ధి చేశామని అన్నారు. ఆగిపోయిన స్కీంలు అన్నింటినీ తిరిగి ప్రారంభించామని ముఖ్యమంత్రి చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమపాళ్లలో చేపట్టామన్నారు. 18 నెలలుగా ప్రతి గంట, ప్రతి క్షణం కష్టపడ్డామన్నారు. 93 స్కీంలను మరలా రివైవ్ చేసినట్లు తెలిపారు. రూ.9000 కోట్ల సోలార్ విండ్ రెన్యూవబుల్ ఎనర్జీ కింద నాటి ప్రభుత్వం డబ్బులు పెంచేసిందని విమర్శించారు. కరెంటు ఛార్జీలు పెంచకుండా వ్యవస్థను నిలబెట్టామన్నారు. కరెంటు ఛార్జీలు ఈ ఏడాది కూడా పెంచమని... వచ్చే ఏడాది పెంచుకుంటామని సీఎం వెల్లడించారు. రాష్ట్రంలో చాలా చోట్ల గ్రౌండ్ వాటర్ పెంచగలిగామన్నారు. ఏపీ బ్రాండ్ రాష్ట్రంలో పూర్తిగా దెబ్బతిన్నదని.. పరిశ్రమలను వెళ్లగొట్టారని మండిపడ్డారు. విద్యా వ్యవస్థలో ఆంగ్ల మీడియం అని చెప్పి డ్రాపవుట్లను పెంచారన్నారు. ఆలిండియా లెవల్‌లో టాప్ ÷వ్ ఉన్న ఎడ్యూకేషన్ సిస్టంను టాప్ త్రీ లేదా వన్‌కు తీసుకువస్తామని స్పష్టం చేశారు. భూగర్భ జలాలను పెంచడం కూడా చేశామన్నారు. ఇటీవల జరిగిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పెట్టుబడుల గురించి అందరికీ తెలిసిందన్నారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయం ఎలా పెరిగిందో చూస్తే రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ గాడిలో



పడుతోందని అర్థమవుతోందన్నారు. ప్రజలకు ఈ విషయాలన్నీ తెలియాలనే ఉద్దేశంతో అన్నీ చేస్తున్నామన్నారు. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ అయిదేళు అధికారంలో ఉందన్నారు. ఇక్కడ సరాసరి జీఎస్టీ 13.5 శాతం సాధించామని... కేంద్ర జీఎస్డీపీ కన్నా ఎక్కువ సాధించామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక 12.02 శాతం వృద్ధి సాధించామని.... ఆల్ ఇండియా లెవల్‌లో 9.8 శాతంగా ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాగా.. 2025-26 తొలి అర్థ సంవత్సరం అలాగే 2వ త్రైమాసికం ఫలితాలను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. స్థిర ధరల వద్ద నమోదైన ఆర్థిక వృద్ధి, రాష్ట్ర స్థూల ఉత్పత్తి, గ్రాస్ వాల్యూ అడిషన్, వ్యవసాయం, ఉత్పత్తి, సేవా రంగాలు నమోదు చేసిన వృద్ధి గణాంకాలను విడుదల చేశారు. విభజన వల్ల రాష్ట్రానికి వ్యవస్థీకృతమైన నష్టం జరిగిందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. 2019-24 పాలన వల్ల వ్యవస్థలు డీఫంక్ట్ అయ్యాయని... రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోయిందని తెలిపారు. గత పాలకుల విధ్వంస పాలన వల్ల గ్రోత్ రేట్ తగ్గి రూ.7లక్షల కోట్ల జీఎస్డీపీ కోల్పోయామని వెల్లడించారు. గ్రోత్ రేట్ లేకపోవటం వల్ల రూ. 76,195 కోట్ల ఆదాయం కోల్పోయా మన్నారు. గత ప్రభుత్వంలో ఎక్కువ వడ్డీలకు అప్పులు తేవటం వల్ల ప్రజాధనానికి నష్టం కలుగుతోందని చెప్పారు. రుణాల రీ-షెడ్యూలింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. బ్రాండ్ తగ్గినప్పుడు వడ్డీ రేటు పెరిగిపోతుందని... తద్వారా రెవెన్యూ జీఎస్డీపీలో రాష్ట్రం చాలా నష్టపోయిందని చెప్పుకొచ్చారు. 25 ఏళ్ల క్రితం చేసిన ఐటీ పాలసీ వల్ల తెలుగు వాళ్ల తలసరి అదాయం గరిష్టస్థాయిలో ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు ఎలా పెంచాలన్నదే ఎప్పుడూ తన ఆలోచన అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# టిడిపిలోకి పులివెందుల వైసిపి నేతలు

**బిటెక్ రవి సమక్షంలో పలువురు చేరిక**

**కడప,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి షాక్‌ల మీద షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. కేవలం 11 సీట్లతో ఘోర ఓటమిని చవిచూసిన జగన్‌కు.. పార్టీ నేతలు కూడా కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత ముఖ్య నేతల నుంచి కిందస్థాయి శ్రేణులు అందరూ కూడా పార్టీని వీడుతున్నారు. ఓటమి మొదలు జగన్‌కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి. తాజాగా సొంత ఇలాకాలో జగన్‌కు ఆ పార్టీ నేతలు భారీ షాక్ ఇచ్చారు. పులివెందులలో వైసీపీ నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. వేంపల్లి పట్టణంలో పలువురు నేతలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. సోమవారం పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి సమక్షంలో కొంతమంది వైసీపీ శ్రేణులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందిరికీ బీటెక్ రవి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం కారణంగా ఆగిపోయిన పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. చంద్రబాబు నాయుడు పాలన చూసి పులివెందుల వైసీపీ నేతలు పార్టీలో చేరుతున్నారని బీటెక్ రవి వెల్లడించారు.

# గంగవరం పోర్టు వద్ద ఉద్రిక్తత

**మత్స్యకారుల ఆందోళనతో చర్చలకు పిలుపు**

**విశాఖపట్టణం,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

గంగవరం పోర్టు గేటు వద్ద నిర్వాసిత మత్స్యకారులు ఆందోళనకు దిగడంతో పోర్టు యాజమాన్యం దిగివచ్చింది. వారిని చర్చలకు పిలిచారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద తమకు ఒక్కొక్కరికి చెల్లించాల్సిన రూ.2 లక్షల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిర్వాసిత మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఇది ఉద్రిక్తతకు దారి తీసింది. గేట్లను తోసుకుంటూ లోపలికి వెళ్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. గంగవరం పోర్టులోని 499 మంది కార్మికులకు ఒక్కొక్కరికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.2 లక్షలు ఇచ్చేందుకు ఏడాది క్రితం యాజమాన్యం ఒప్పందం చేసుకుంది. వీటి చెల్లింపుల్లో ఆలస్యం చేస్తున్నారని, పన్నుల రూపంలో డబ్బులు అయిపోయాయని అధికారులు సాకులు చెబుతున్నారని ఆరోపిస్తూ కార్మికులు కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈక్రమంలో సోమవారం కార్మికులంతా మూకుమ్మడిగా గేటు వద్దకు వచ్చారు. దీంతో యాజమాన్యం స్పందించి కార్మిక నాయకులను చర్చలకు పిలిచింది. వివిధ అంశాలపై వారితో అధికారులు చర్చిస్తున్నారు.

# నిర్వహణా లోపమే ఇండిగో సంక్షభానికి కారణం

**భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా చర్యలు**
**మరిన్ని ప్రైవేట్ సంస్థలను ప్రోత్సహించే యత్నం**
**రాజ్యసభలోపౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు**

**న్యూఢిల్లీ,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

ఇండిగో నిర్వహణ వైఫల్యమే ప్రస్తుత పరిస్థితులకు దారితీసిందని పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అన్నారు.'ఇండిగో సంక్షోభం' నేపథ్యంలో రామ్మోహన్ నాయుడు సోమవారం పార్లమెంట్‌లో ఓ ప్రకటన చేశారు. భవిష్యత్తులో ఇతర ఎయిర్‌లైన్స్ నుంచి ఇలాంటివి పునరావృతం కాకుండా మా చర్యలు ఉండనున్నాయి. భారతదేశంలో కొత్త విమానయాన సంస్థ ప్రారంభం కావడానికి ఇదే మంచి తరుణం. పోటీ సంస్థలు ఏర్పాటయ్యేలా చర్చలు జరపనున్నాం అని మంత్రి రాజ్యసభలో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాగానే ఇండిగో సంక్షోభంపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే మంత్రి స్పందించి ప్రకటన చేశారు. విమానయాన సిబ్బంది పని గంటలపై పరిమితులకు సంబంధించిన నిబంధనలను ఇండిగో సరిగా అమలుచేయకపోవడమే సర్వీసుల రద్దుకు దారితీసిందని వెల్లడించారు. ఏవియేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్ ఈ అంతరాయాలకు కారణం కాదని తెలిపారు. సిబ్బందికి సంబంధించిన రోస్టరింగ్ విధానాన్ని సరిగా అమలుచేయలేదు.ఈ వైఫల్యానికి ఏఎంఎస్ఎస్ సిస్టమ్ కారణం కాదు. డిసెంబర్ ఒకటిన రోస్టరింగ్ నిబంధనలకు సంబంధించి ఇండిగోతో సమావేశం నిర్వహించాం. ఆ సంస్థ ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలపై మేం స్పష్టత ఇచ్చాం. అప్పుడు వారు ఎలాంటి సమస్యలను ప్రస్తావించలేదు. ఇక సమస్యను పరిష్కరించేందుకు ఎయిర్‌లైన్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం కొన్ని రోజులుగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న తీవ్ర అంతరాయానికి చింతిస్తున్నాను. ఈ సమస్యను మేం తేలిగ్గా తీసుకోలేదు. ఇప్పటికే దర్యాప్తునకు ఆదేశించాం. ఇదిలాఉంటే.. ఇండిగో వ్యవహారంపై కేంద్రం ఇప్పటికే ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. కొద్దిరోజులుగా సేవల్లో అంతరాయానికి గల కారణాలను విచారించనుంది. బాధ్యులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. మొత్తం నలుగురు సభ్యులతో కూడిన కమిటీని పౌర విమానయాన శాఖ ఏర్పాటుచేసింది. ఈ కమిటీలో డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ సంజయ్ కె.బ్రహ్మనే, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అమిత్ గుప్తా, సీనియర్ ఫ్లైట్ ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ కెప్టెన్ కపిల్ మాన్‌గ్లిక్, ఆపరేషన్స్ ఇన్‌స్పెక్టర్ లోకేష్ రాంపాల్ ఉన్నారు. వీరు భవిష్యత్తులో ఎలాంటి అంతరాయాలు చోటుచేసుకోకుండా కొన్ని సిఫార్సులు కూడా చేయనున్నారు.

# సిద్ధరామయ్య ఎన్నికపై సవాల్

న్యూఢిల్లీ,డిసెంబర్8(జై భీమ్ న్యూస్): కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది . 2023లో వరుణ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికను సవాల్ చేస్తూ కె శంకర అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌కు సమాధానం ఇవ్వాలని సిద్ధరామయ్యను ఆదేశిస్తూ కోర్టు ఇవాళ నోటీసులు జారీచేసింది.కాగా 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని నిబంధన ప్రకారం సిద్ధరామయ్య అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డారని, వరుణ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించాలని పిటిషనర్ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఆ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దాంతో పిటిషనర్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. సుప్రీంకోర్టు ఇవాళ సిద్ధరామయ్యకు నోటీసులు జారీచేసింది.ఒకవైపు కర్ణాటకలో సీఎం మార్పుపై ఊహాగానాలు తీవ్ర స్థాయిలో చక్కర్లు కొడుతున్న వేళ సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. మరోవైపు నేషనల్ హెరాల్డ్ కేసులో డీకే శివకుమార్‌కు ఆర్థిక నేరాల విభాగం నోటీసులు జారీచేసింది. ఆర్థిక విషయాలు, లావాదేవీలపై శివకుమార్ వివరణ కోరుతూ ఇక్షచి నోటీసులు ఇచ్చింది.

# 16 నుంచి తిరుప్పావై ప్రవచనాలు

**తిరుమల,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 233 కేంద్రాల్లో టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రముఖ పండితులు తిరుప్పావై ప్రవచనాలు చేయనున్నారు.ఇందులో భాగంగా తిరుపతితో పాటు ఆంధ్రప్రదేశ్‌లో 76, తెలంగాణలో 57, తమిళనాడులో 73, కర్ణాటకలో 21, పాండిచ్చేరిలో 4, న్యూఢిల్లీ, ఒడిశాలో ఒకొక్క కేంద్రంలో తిరుప్పావై ప్రవచనాలు నిర్వహించనున్నామని ప్రాజెక్టు అధికారులు వివరించారు. సంప్రదాయం ప్రకారం దేశవ్యాప్తంగా గల అన్ని వైష్ణవ దేవాలయాలలో తిరుప్పావై శాత్తుమొర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని వెల్లడించారు.

# ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

**రెండు లారీలు ఢీకొని ఒకరు దుర్మరణం**

**ఒంగోలు,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

ప్రకాశం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బెస్తవారిపేట మండలం పెంచికలపాడు వద్ద రెండు లారీలు ఢీకొడనంతో డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. టమాటా లోడ్‌తో వస్తున్న మినీ లారీ, ఆయిల్ ట్యాంకర్ ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రెండు లారీలు ఢీకొనడంతో ఆయిల్ ట్యాంకర్‌లో మంటలు చెలరేగాయి. దీంతో అందులోని డ్రైవర్ మంటల్లో కాలి మరణించాడు. ధర్మవరానికి చెందిన కుంపటి శేషయ్య అనే వ్యక్తి.. టమాటా లోడ్‌తో లారీలో అనంతపురం నుంచి రాజమండ్రికి వెళ్తున్నాడు. బేస్తవారిపేట మండలం పెంచికలపాడు వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న లారీ టైరు పేలిపోవడంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ బోల్తా పడగా.. ట్యాంకర్ లారీ ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఆయిల్ ట్యాంకర్ లారీ డ్రైవర్ పైడికొండల దుర్గారావు(40) అందులోనే ఇరుక్కుపోయాడు.అతను బయటకు వచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ.. లారీలో మంటలు వ్యాపించి సజీవదహనమయ్యాడు. మృతుడి స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి. దుర్గారావు సోమవారం విశాఖ సమీపంలోని పరవాడ వద్ద చమురును లోడ్ చేసుకుని తాడిపత్రిలోని ఓ సిమెంటు పరిశ్రమలో అన్‌లోడ్ చేసేందుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపారు.

# గోదావరిలో తప్పిన ప్రమాదం

**కోనసీమ,డిసెంబర్8(జై భీమ్ న్యూస్):**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని సఖినేటిపల్లి - పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మధ్య వశిష్ఠ గోదావరిలో ప్రయాణికులను చేరవేసే పంటు సాంకేతిక లోపంతో నది మధ్యలో నిలిచిపోయింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వందమందికి పైగా ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. రెండు జిల్లాలకు చెందిన వేలమంది నిత్యం వీటిపైనే రాకపోకలు సాగిస్తుంటారు. ఉదయం నరసాపురం నుంచి సఖినేటిపల్లి వైపు ప్రయాణికులను ఎక్కించుకుని పంటు బయలుదేరింది. గోదావరి మధ్యకు రాగానే ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఆగిపోయింది. బాగుచేయడానికి ప్రయత్నించినా ఫలించలేదు. అదే సమయంలో నదిలో ప్రవాహవేగం ఎక్కువగా ఉంది. దీంతో పంటు అంతర్వేది సాగర సంగమం వైపు వెళ్లిపోసాగింది. నిర్వాహకులు అప్రమత్తమై మరో పంటు సాయంతో ఒడ్డుకు చేర్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# మావోయిస్టులకు మరో దెబ్బ

**కీలక నేత రాంధేర్‌తో పాటు పలువురు లొంగుబాటు**

**రాయ్‌పూర్,డిసెంబర్8(ఆర్ఎన్ఎ):**

మావోయిస్టులకు మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. సోమవారం ఛత్తీస్‌గఢ్‌లో 11 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో కీలక నాయకుడు, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రాంధేర్ కూడా ఉన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలిపిన ఎంఎంసీ జోన్‌లో రాంధేర్ కీలకంగా పని చేస్తున్నారు. మావోయిస్టు అగ్రనేత శీర్షనేత మిళింద్ తెల్టుంబే మరణించిన తర్వాత ఎంఎంసీ బాధ్యతలన్నీ రాంధేర్ చూసినట్లు పోలీసులు వెల్లడించారు. తాజాగా లొంగిపోయిన రాంధేర్‌పై రూ.3 కోట్ల రివార్డు ఉందని పోలీసులు ప్రకటించారు. రాంధేర్ లొంగుబాటుతో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నక్సల్ క్రియాశీలతను గణనీయంగా తగ్గిస్తుందని భద్రతా వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవలి నెలల్లో వివిధ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోతుండటం గమనార్హం. మావోయిస్టు నాయకత్వంలో అంతర్గత విభేదాలు, భద్రతాదళాల ఆపరేషన్ల కఠినతరం, ప్రభుత్వ పునరావాస పథకాలు వంటి పరిణామాలు పెద్ద సంఖ్యలో మావోయిస్టుల లొంగుబాటుకు కారణమైనట్లు అధికారులు అభిప్రాయపడ్డారు.

# ఢిల్లీ విమానాశ్రయంలో భారీగా గంజాయి పట్టివేత

**అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.15 కోట్ల విలువ**



**న్యూఢిల్లీ,డిసెంబర్8(ఆర్ఎన్ఎ):**

దేశ రాజధాని ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు సోమవారం భారీగా విదేశీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి ఢిల్లీకి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల లగేజీ బ్యాగుల్లో దాచిపెట్టి గంజాయిని తరలించే ప్రయత్నం చేస్తుండగా కస్టమ్స్ సిబ్బంది గుర్తించారు. అధికారులకు స్కానింగ్ సమయంలో అనుమానం రావడంతో ఆ ఇద్దరి బ్యాగులను సోదా చేయగా అందులో పెద్ద మొత్తంలో గంజాయి బయటపడింది. అధికారులు స్వాధీనం చేసుకున్న విదేశీ గంజాయికి అంతర్జాతీయ మార్కెట్‌లో దాదాపుగా రూ.15 కోట్లు విలువ ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గంజాయిని స్మగ్లింగ్ చేయడానికి ప్రయత్నించిన కేటుగాళ్లను అధికారులు అక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. విదేశీ మార్గాల ద్వారా డ్రగ్స్ రవాణా పెరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్‌లో తనిఖీలను మరింత కఠినతరం చేసినట్లు కస్టమ్స్ వర్గాలు వెల్లడించాయి.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem




## టాలీవుడ్ లోకి హీరోగా ఎంట్రీ ఇస్తున్న నివేదా థామస్ సోదరుడు


టాలీవుడ్‌లో మరో నూతన కథానాయకుడు అడుగుపెడుతున్నాడు. 'జై లవకుశ', 'జెంటిల్ మెన్' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి నివేదా థామస్ సోదరుడు నిఖిల్ థామస్ హీరోగా పరిచయం కాబోతున్నాడు. ఆయన నటిస్తున్న తొలి చిత్రానికి 'బెంగళూరు మహానగరంలో బాలక' అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ, చిత్రబృందం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. మహి - రాజ్ దర్శక ద్వయం ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. బెంగళూరు నేపథ్యంలో సాగే ఈ కథకు సంబంధించిన పోస్టర్‌ను ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. పవన్ కల్యాణ్ 'పంజా' సినిమా ఫస్ట్ లుక్, సత్యం కంప్యూటర్స్, 'కొలవెరి డి' పాట వంటి అంశాలను పోస్టర్‌పై పొందుపరచడంతో ఇది ఒకప్పటి కాలాన్ని ప్రతిబింబించే కథగా తెలుస్తోంది. సయా క్రియేషన్స్, ఫాల్కన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అఖిల్ యమ్మన్నగారి, ఎంఎస్ఎన్ మూర్తి, సీహెచ్ వీ శర్మ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సాంకేతిక బృందం కూడా బలంగా ఉంది. ఇటీవల విజయవంతమైన 'మ్యాడ్', 'జాతిరత్నాలు' చిత్రాలకు రచయితగా పనిచేసిన ప్రవీణ్ పట్టు స్క్రీన్‌ప్లే, సంభాషణలు అందిస్తుండటం విశేషం. విశ్వదీప్ సంగీతం సమకూరుస్తుండగా, మల్లు నాయక్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుందని నిర్మాతలు తెలిపారు.

## 'ది గర్ల్‌ఫ్రెండ్' తప్పకుండా చూడాల్సిన సినిమా..

**రష్మికను మెచ్చుకున్న జాన్వీ కపూర్**
**రష్మిక మందన్న 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రాన్ని మెచ్చుకున్న జాన్వీ కపూర్**
**రష్మిక నటనకు ఫిదా అయిన జాన్వీ.. ఇన్‌స్టాలో ప్రత్యేక పోస్ట్**
**ప్రస్తుతం రామ్ చరణ్‌తో 'పెద్ది' సినిమాలో నటిస్తున్న జాన్వీ**




బాలీవుడ్ నటి జాన్వీ కపూర్, టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న నటనపై ప్రశంసల వర్షం కురిపించారు. రష్మిక ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'ను ప్రతి ఒక్కరూ తప్పకుండా చూడాలని ఆమె సూచించారు. ఈ మేరకు జాన్వీ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలోని ఓ కీలక సన్నివేశాన్ని షేర్ చేశారు. దీనికి TheGirlfriend. Mandatory Watch (తప్పకుండా చూడాలి) అని క్యాప్షన్ జోడించారు. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో వచ్చిన ఈ రొమాంటిక్ డ్రామాలో రష్మిక నటనకు మంచి మార్కులు పడ్డాయి. ప్రస్తుతం జాన్వీ కపూర్, మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ సరసన 'పెద్ది' అనే భారీ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో ఆమె 'అచ్చియమ్మ' అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్లు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవల మైసూర్‌లో జానీ మాస్టర్ కొరియోగ్రఫీలో ఏకంగా 1000 మంది డ్యాన్సర్లతో ఓ భారీ పాటను చిత్రీకరించారు. రామ్ చరణ్ పుట్టినరోజు కానుకగా 2026 మార్చి 27న 'పెద్ది' చిత్రాన్ని పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



## రోజుకు 8 గంటల పనిపై కృతి శెట్టి వ్యాఖ్యలు

యంగ్ హీరోయిన్ కృతి శెట్టి, సినిమా రంగంలో పని గంటలపై జరుగుతున్న చర్చపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొందరు నటీమణులు రోజుకు 8 గంటలు మాత్రమే పనిచేస్తామని చెప్పడంపై తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. సినిమా పరిశ్రమలో అందరికీ ఒకేరకమైన నియమాలు వర్తించవని, పని గంటలనేది పూర్తిగా వ్యక్తిగత నిర్ణయమని ఆమె అన్నారు. తాను నటించిన కొత్త తమిళ చిత్రం 'వా వాతియార్' ప్రమోషన్‌లో భాగంగా ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో కృతి శెట్టి మాట్లాడారు. "సినిమాలో అందరి పని విధానం ఒకేలా ఉండదు. ప్రతి ఒక్కరూ విభిన్నంగా ఉంటారు. ముఖ్యంగా నటీమణులు తమ జీవనశైలి, పని విషయంలో చాలా స్పష్టతతో ఉంటారు. కాబట్టి, ఎవరికి ఏది సౌకర్యంగా ఉంటుందనే దానిపైనే ఇది ఆధారపడి ఉంటుంది" అని ఆమె వివరించారు. తన వ్యక్తిగత అభిప్రాయం గురించి చెబుతూ, "నాకు ప్రస్తుతం కుటుంబ బాధ్యతలు తక్కువ. శక్తి ఉన్నంతవరకు అవసరమైతే 24 గంటలు పనిచేయడానికైనా నేను సిద్ధం. నేను ఒక డైరెక్టర్ అనుకూల యాక్టర్‌ను. 13 గంటలు నేను సెట్‌లో ఉండాలని దర్శకుడు కోరుకుంటే కచ్చితంగా ఉంటాను. ఈ సినిమా షూటింగ్ సమయంలో ఒకేసారి హైదరాబాద్, చెన్నైలలో డబుల్ షిఫ్టులు కూడా చేశాను. అయితే, ఎవరైనా తక్కువ గంటలు పనిచేస్తామంటే దాన్ని నేను తప్పుగా చూడను... అది వారి అభిప్రాయం" అని కృతి పేర్కొన్నారు. పని గంటల విషయంలో నటీనటులు, దర్శకనిర్మాతలు ముందే మాట్లాడుకుంటే ఎలాంటి సమస్యలు రావని ఆమె సూచించారు. "ఒక నటి ఎన్ని గంటలు పనిచేయగలదో ముందే దర్శకనిర్మాతలకు తెలిస్తే, అందుకు అనుగుణంగా ప్రణాళిక వేసుకుంటారు.